ప్రజాపక్ష

సమీక్ష

ఫిబ్రవరి 15-28, 2003 | సమతా పబ్లికేషన్స్ ప్రచురణ | వెల రు. 5-00

లోపలి పేజీల్లో.....

వార్షిక చందా రూ॥ 120/-లు

Edited, printed and published by
V. Hanumantha Rao
for **Samata Publications**
D.No. 8-3-898/22, Road No.3,
Nagarjuna Nagar,
Hyderabad - 500 073.
Phone : 23748672

DTP at : Sri Sai Shamili Graphics
Golnaka, Hyd. Ph. 2756 9274

Printed at : Charita Graphics
Chikkadpally, Hyderabad - 020.

సంపాదకీయం :

విదేశీ యుద్ధం, స్వదేశీ యుద్ధం

ప్రపంచాన్ని యుద్ధ మేఘాలు కమ్ముకొని వస్తున్నాయి. ఇవాళా రేపా అన్నట్లుంది. అమెరికా దాడి చేసేది కేవలం ఇరాక్ మీదనే కాదు; మొత్తం ప్రపంచ మానవాళిమీదనే. ప్రపంచ ప్రజావాణిని ఖాతర్ చేయకుండా, ఎవరు తనవెంట వచ్చినా, రాకపోయినా, ఐక్యరాజ్యసమితి కాదన్నా, ఆ సమితి పరిశీలక బృందం ఇరాక్‌లో మారణాయుధాలు న్నాయని స్పష్టంగా ధృవపరచకపోయినా, తాజాగా అమెరికా ప్రతినిధి సమితి సమావేశంలో ప్రవేశపెట్టిన "తిరుగులేని సాక్ష్యం" సభ్యులకు నమ్మకం కలిగించలేకపోయినా, ఇరాక్‌పైకి కాలుదువ్వుతున్నదంటే, తన ధన, ఆయుధ బలంతో రంకెలు వేస్తున్నదంటే, ప్రపంచాన్నే తన పాదాక్రాంతం చేసుకోవాలని ప్రయత్నించి, భంగపడ్డ హిట్లర్ గుర్తుకు వస్తున్నాడు. వాడూ ఇట్లాగే రంకెలు వేసి మట్టిలో కలిసిపోయాడు. దీనికి ప్రజాబలమే విరుగుడుగా పని చేయగలుగుతుంది. అనేక దేశాల్లో ప్రజలు గళం విప్పారు. ప్రభుత్వాలే అమెరికాను తగ్గమంటున్నాయి. అమెరికా తనను తానే సంభాళించుకోలేకపోతే, ప్రజాస్వామ్యానికే అర్థం లేకుండాపోతోంది. యుద్ధమే ప్రారంభమైతే, అది సామాన్య ప్రజల జీవితాలను మరింత దుర్భరం చేస్తుంది. పెట్రోలు ధరల పెరుగుదల ఒక ఉదాహరణ మాత్రమే. ఎక్కడో ఇరాక్‌లో యుద్ధం జరిగితే మనకేమిటని మిన్నకుంటే, ఆ తర్వాత మనం పడేపాట్లు వర్ణనాతీతంగా వుంటాయి. ఒకవేళ యుద్ధం త్వరలోనే ముగిసినా, యుద్ధం తాలూకు భారాలు మనలను వెంటాడు తూనే వుంటాయి. ఆంధ్రప్రజలు కూడా ప్రపంచ ప్రజలతో గళం కలపాలి.

దేశంలో, రాష్ట్రంలో ప్రజలమీద కేంద్ర, రాష్ట్ర పాలకులు మరో యుద్ధం ప్రకటించారు. అదే ధరల యుద్ధం. ధర పెరగని వస్తువూ లేదు; సేవాలేదు. అన్నిటికన్నా భయంకరమైనది యూజర్ ఛార్జీలు. ప్రకృతిలో గాలి పీలిస్తే, రోడ్డుమీద నడిస్తే తప్ప మిగతా సేవలన్నిటిమీద, మెడమీద తలకాయవున్న ప్రతి సీనియర్ అధికారికి యూజర్ ఛార్జీలను బనాయించే అధికారం సంక్రమించింది. పేనుకు పెత్తనం ఇస్తే తలంతా తెగకొరికిందన్నట్లు, వీరు విజృంభించగలరు. ఇప్పటికే కొన్ని శాఖల్లో యూజర్ ఛార్జీల వసూళ్లు చాప కింద నీరులాగా సాగుతున్నాయి. అనేక సమస్యల మీద ప్రజలు, పార్టీల ప్రమేయం లేకుండానే, ప్రజలు వారి కోపాగ్నికి ధర్నాలు, ముట్టడులు, ఘెరావ్‌లు, రాస్తా, రైల్ రోకోల ద్వారా తెలియజేస్తున్నాయి. బుష్‌లాగే దేశంలో పాలకులు ప్రవర్తిస్తే బుష్‌లాగే ఏకాకులవుతారు.

రెండు రెళ్ళ నాలుగు

వినిమయ ధరల సూచిక

(బేస్ : 1982-100)

సెంటర్ సిరీస్	అక్టోబర్ 01	నవంబర్ 01	డిసెంబర్ 01	జనవరి 02	ఫిబ్రవరి 02	మార్చి 02	ఏప్రిల్ 02	మే 02	జూన్ 02
ఆలిండియా	468	472	-	-	-	468	469	472	476
హైదరాబాద్	446	447	455	460	459	462	462	466	469
గుంటూరు	456	459	460	466	465	451	453	463	468
గూడూరు	446	455	447	447	438	431	430	440	453
విశాఖ	454	458	456	460	456	460	462	466	468
వరంగల్	479	486	483	496	489	486	487	496	496
కొత్తగూడెం	491	476	475	476	467	458	457	464	471
రాష్ట్ర సిరీస్									
విజయనగరం	403	405	404	405	404	406	408	410	413
రాజమండ్రి	444	488	448	450	449	452	454	457	460
విజయవాడ	429	431	431	433	432	437	438	442	444
ఆదోని	453	455	454	457	457	459	461	464	467
ఎస్.ఎస్.బి. కాంప్లెక్స్	450	434	453	456	456	458	460	462	464
ఎంజిపి కాంప్లెక్స్	429	432	431	433	434	440	441	444	448

(ఆధారం : అర్థ గణాంక శాఖ)

సమీక్షా సమీక్ష

జనవరి 16-31 సంచిక చదివాను. రచనలు చాలా విమర్శనాత్మకంగా వున్నాయి. విమర్శనలేకాక రాష్ట్రం సాధించిన అభివృద్ధిని గురించి కూడా వ్యాసాల రూపంలో ప్రచురిస్తే బాగుంటుంది. ఈ విషయంలో నేను డా. ఎర్రంరాజుగారితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఇక ఎం.వి. విద్యుల్లత గారు రచించిన 'వెనుకబాటు తనంలో కూడా స్త్రీలదే ముందడుగు' వ్యాసంలో "నెంబర్ వన్ రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్" అనే వాక్యం వాడటం సరికాదు. దీనికి బదులు "అక్షర క్రమంలో అగ్రగామిగా వున్న ఆంధ్రప్రదేశ్" అనటం సరిగా వుంటుందని నా భావన.

- జె. శివరామ్
హైదరాబాద్

ఆర్థికం, అభివృద్ధి లాంటి విషయాలగురించి ప్రత్యేకంగా తెలుగులో ఏ పత్రికా లేనిలోటు 'సమీక్ష' పత్రిక తీరుస్తుంది. ఈ విషయాల గురించి రాయాలంటే చాలా శ్రమపడాలి. విషయ పరిజ్ఞానం వుండాలి. దినపత్రికలు చదువుతుంటే ఇలాంటి వ్యాసాలు చాలా అరుదుగా కనపడతాయి. అయితే పత్రిక 24 పేజీలు మాత్రమే వుండటం మీ ప్రయత్నానికి పరిమితి విధిస్తుంది. ఇంకా ఎక్కువ పేజీలలో ఈ పత్రిక రావాలి. కవర్‌పేజీ ఆకర్షణీయంగా వుండాలి.

- వాసా నీరజ
విజయవాడ

నేను ప్రజాపక్ష సమీక్ష పత్రిక చందా దారుణ్ణి. రెండు సంచికలు వచ్చాయి. పత్రిక రెండు సంచికలు బావున్నాయి. విలక్షణంగా కూడా ఉన్నాయి. రాజకీయ / ఆర్థిక విషయాల విశ్లేషణ బావుంది. పత్రిక పదివందల మంది నుండి పది కోట్ల మందికి పదికాలాల పాటు అభివృద్ధి చెందుతూ నడవాలని హృదయ పూర్వకంగా ఆశిస్తున్నాను.

- సి.హెచ్. గణపతి
పెందుర్తి

ప్రయివేటీకరణ బాటలో సింగరేణి బొగ్గుగనులు
కార్మికుల హక్కులపై పెరుగుతున్న దాడులు

- కె.ఎల్. మహేంద్ర

సింగరేణి బొగ్గుగనుల సంస్థను నిజాం పాలనలో ప్రభుత్వరంగంలో స్థాపించి వంద సంవత్సరాలు దాటిపోయింది. అప్పటికి అన్ని పరిశ్రమలు ప్రైవేటు కంపెనీల చేతుల్లోనే ఉన్నాయి. 1970లోనే బొగ్గుగనులను జాతీయం చేసారు. దీనికి పూర్వం కాంట్రాక్టర్ల ద్వారా పనిచేస్తున్న బొగ్గుగని కార్మికుల జీవితాలు నరక కూపాలు.

భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు వరల్డ్‌బ్యాంక్, ఐ.ఎం.ఎఫ్ సంస్థల ఆదేశాలను శిరసావహించి వాటి కనుగుణంగా ఆర్థిక పరమయిన సర్దుబాట్లు చెయ్యడానికి ఒప్పుకుని, మార్కెట్ ఎకానమీకి అనుగుణంగా లాభార్జన దృష్టితో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు రంగంలోనికి మార్చడం జరుగుతోంది.

1993లో సింగరేణి గనుల కంపెనీలో పెట్టిన పెట్టుబడికి మించి అప్పులు అవ్వడం మూలంగా సంస్థను బి.ఐ.ఎఫ్.ఆర్. కి అప్పగించడం జరిగింది. కార్మిక సంఘాలు బి.ఐ.ఎఫ్.ఆర్. అంటే బోర్డ్ ఆఫ్ ఫ్యునరల్ రైట్స్ అని నామకరణం చేసారు.

ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎ.ఐ.టి.యు.సి) అనుబంధ సంస్థ అయిన సంగరేణి బొగ్గు గనుల కార్మిక సంఘం చొరవతీసుకుని కార్మికులలో విస్తృత ప్రచారం చేపట్టి మెరుపు సమ్మెలకు దిగవద్దని, ఉత్పత్తిని, పనినాణ్యతను పెంచాలని, కంపెనీని అప్పులబారినుండి విముక్తి చేసి బి.ఐ.ఎఫ్.ఆర్. నుండి బయటపడేయ్యాలనీ ఉద్భోధ చేసింది. మిగతా కార్మిక సంఘాలుకూడా ఈ కార్యక్రమానికి పూర్తి మద్దతును ఇచ్చాయి. బి.ఐ.ఎఫ్.ఆర్. కి వెళ్ళిన అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలు మూతపడటంగాని అమ్మివేయడం గాని జరిగింది. అయితే సింగరేణి కార్మకులు గనులను బి.ఐ.ఎఫ్.ఆర్. నుండి కాపాడి అతి తక్కువ సమయంలోనే లాభాలబాట పట్టించారు. మొదటి సంవత్సరం సంస్థను అబ్జర్వేషన్‌లో ఉంచింది బి.ఐ.ఎఫ్.ఆర్. రెండవ సంవత్సరం కూడా లాభాలు గడించాక బి.ఐ.ఎఫ్.ఆర్. నుండి సంస్థ బయట పడింది. ఆ తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గు తవ్వకాలను విస్తృతపర్చారు. ఈ సంస్థలలో కేంద్రానికి 49%, రాష్ట్రానికి 51% వాటా ఉంది. యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానిది.

గత కొన్ని సంవత్సరాలుగా సంస్థ లాభాలు గడిస్తూ 1100 కోట్ల రూపాయల పాతబాకీలు రద్దు చేయగల్గింది. ఈ సంవత్సరం వాటాదారులకు పెట్టుబడిమీద డివిడెండ్ ఇచ్చే స్థితికి చేరుకుంది.

గత పది సంవత్సరాలుగా లాభాలలో 10% వాటాగా రాష్ట్ర ప్రభుత్వం గనిలో పనిచేస్తున్నవారికి ఇస్తోంది. పనివారి పట్టుదలకు, కష్టార్జితాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఇటువంటి పరిస్థితిలో, ఈ దశలో ముఖ్యమంత్రి ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం సింగరేణి సంస్థలో మార్పులకు శ్రీకారం చుట్టాడు. ఓ సంవత్సరం క్రితం నుంచి పని వారి సంఖ్యను తగ్గించడం, పనులను కంపెనీ అంతర్గతంగా కాక బయట సంస్థలకు, కాంట్రాక్టర్లకు అప్పగించడం ప్రారంభించింది.

వి.ఆర్.ఎస్. తీసుకుని రిటైరవుతున్న వారి స్థానంలో కొత్తగా పనివారిని భర్తీ చేయడంలేదు. ఆర్థికంగా పనివారిసంఖ్యను తగ్గించి వేస్తోంది. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే నెపంతో కొంతపనిని బయటవారికి అప్పగిస్తోంది. రవాణా తదితర అనుబంధ కార్యక్రమాలను కాంట్రాక్టు పద్ధతి మీద చేయించుకుంటుంది. ఇదివరలో కాలనీ గృహ నిర్మాణంలో తప్పించి ఎందులోనూ కాంట్రాక్టర్లను నియమించలేదు. ఒక డివిజన్‌లో ఒక్కోరకం పనిని సింగరేణి సంస్థ పనివారే చేస్తూ ఉంటే అదే పనిని ఇంకోడివిజన్‌లో కాంట్రాక్టర్‌కి అప్పగిస్తున్నారు. కార్మిక సంఘాలు ఈ పద్ధతిని ఖండిస్తూ వస్తున్నాయి. తమ వ్యతిరేకతను యాజమాన్యానికి తెలియ జేస్తున్నాయి. ప్రాథమిక గని పనుల్లో కాంట్రాక్ట్ పద్ధతి ఉండదని యాజమాన్యం చెప్పుకుంటూ వస్తోంది. వరల్డ్‌బ్యాంక్ ఆదేశాల మేరకు సంస్థాగత సర్దుబాట్లను త్వరితగతిన ఆచరణలో పెట్టాల్సి ఉంది. రెండవ విడత సరళీకరణలో భాగంగా అన్ని రాష్ట్రాలలోనూ ప్రభుత్వ సంస్థల్లో హైర్ అండ్ ఫైర్ పాలసీని, కాంట్రాక్టీకరణను, ప్రైవేటీకరణను వేగంగా కొనసాగించాలనే ప్రపంచబ్యాంక్ ఒత్తిడి కేంద్రప్రభుత్వంపై ఉంది. అందుచేత విద్యుత్, రవాణా, నీటి పారుదల తదితర రంగాల్లో కూడా ప్రైవేటీకరణను అమలు చెయ్యాలి. ఋణగ్రహీతలు ఒప్పుకున్న ఋణదాతల షరతులలో భాగమే ఇది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు,

ఉద్యోగులు, ఉద్యోగ భద్రత, పని భద్రత, ఆదాయ భద్రతలకు ముప్పు వాటిల్లుతుందనే నిరంతర భయాందోళనలకు గురౌతున్నారు.

విద్యుత్ బోర్డును రద్దుచేసి ప్రైవేటీ కరణకు అనుకూలంగా వివిధ కార్పోరేషన్లగా విడగొట్టారు. రోడ్డు రవాణా సంస్థను ప్రైవేటీకరించడానికి సర్వసన్నద్ధమై ఉన్నారు. ఆర్.టి.సి. సంస్థలోని అన్ని ప్రధాన సంఘాలు ఒక్కటై వ్యతిరేకించ డంతో, 24 రోజుల సమ్మెతో అన్ని వామపక్షాలు, కాంగ్రెస్ మద్దతుతో ఈ ప్రభుత్వ ఆలోచన కొంచెం మందగించింది.

ప్రజల నాడిని గ్రహించి తెలుగుదేశం ప్రభుత్వం సింగరేణి బొగ్గుగనుల సంస్థను ప్రైవేటు చెయ్యాలని అంటున్నది. కాని అన్నిరకాల పనులను కాంట్రాక్ట్ పద్ధతిపై నిర్వర్తించడానికి పూనుకుంది. బొగ్గుగనుల జాతీయాకరణ చట్టం ప్రకారం బొగ్గు గనులను ప్రైవేటీకరించడకూడదని, గనుల్లో పనులు కూడా ప్రైవేట్ సెక్టర్ పాత్రతో నిర్వర్తించకూడదని స్పష్టం చేయబడింది. దీని ప్రకారం ఉత్పత్తిని కాంట్రాక్ట్ల ద్వారా కొనసాగనియ్యకూడదు.

గత సంవత్సరంగా సి.ఎస్.పి. తదితర పనులను కంపెనీ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం, దీనిని సంఘాలు వ్యతిరేకించ డం జరుగుతూనే ఉంది. ఎప్పుడయితే సర్ఫేస్ మయినర్స్ ద్వారా బొగ్గు ఉత్పత్తిని 21 నెలలపాటు కాంట్రాక్ట్కి అప్పగించారో అప్పటినుండి పనివారికి ఆలోచన తీవ్రరూపం దాల్చింది. ఈ వ్యవహారమంతా గుట్టుగా జరిగింది. గుర్తింపు సంఘాలతో సహా అన్ని కార్మిక సంఘాలతో ఈ విషయం చర్చించలేదు. వారి దృష్టికి తీసుకురాలేదు. ఒప్పందం ప్రకారం యాజమాన్యం గుర్తింపు యూనియన్కి తెలియజేయవలసి ఉంది. కాని అది జరగలేదు. అయితే కాంట్రాక్ట్ ఒప్పందాలన్నీ జరిగిపోయాక యాజమాన్యం గుర్తింపు యూనియన్ని ఆ కాంట్రాక్ట్ ఎగ్రిమెంట్ని గౌరవించమని, ఆచరించమని ఒత్తిడి చేసింది. గుర్తింపు యూనియన్ను తనకను గుణంగా మలచుకోవడానికి ప్రయత్నించింది. ఎప్పుడయితే ఈ రకమయిన దాగుడుమూతల పర్వం యాజమాన్యం కొనసాగిస్తుందో కార్మిక సంఘాలు ఓ ఐక్యకార్యాచరణ సంఘాన్ని స్థాపించుకొని సమ్మె నోటీసులు ఇచ్చారు. సింగరేణి పరిరక్షణ సమితి ని స్థాపించారు. ఉద్యమాన్ని ఈ సమితిద్వారా కొనసాగించారు.

ముఖ్యమంత్రి సంస్థను ప్రైవేటికరించమని హామీ ఇస్తూనే కాంట్రాక్టర్లను ఉపయోగించుకోవడం గాని, బయటనుండి పనులు చేయించుకోవడం గాని యాజమాన్య హక్కుఅని తెలియచేసారు.

అన్ని కార్మికసంఘాలు కేంద్రప్రభుత్వం తీసుకొనున్న కార్మికచట్టాల సంస్కరణలను వ్యతిరేకించాయి. రెండవజాతీయ లేబర్ కమీషన్ సలహాలను కేంద్రప్రభుత్వం ఇంకా ఆచరణలో పెట్టలేదు. అయినాకూడా చంద్రబాబు ప్రపంచ బ్యాంకు సలహాలను ఆచరణలో పెట్టడానికి చాలా కంగారు పడిపోతున్నాడు. ప్రజల బ్రతుకులపై ఆయనకు ఏమీ మమకారం లేదు. వారి జీవితాలతో చెలగాటమాడి లాభాలు ఆర్జించాలన్నదే ధ్యాస. అయితే కార్మికులు గుర్తించారు. దీని వెనుక కుట్రను గ్రహించారు. వారి పిల్లలకి పనులు దొరికే అవకాశాలు సన్నగిల్లి పోతున్నాయని, కాంట్రాక్టర్ల చేతిలో పనివారికి, వారి పిల్లలకి ఒనగూరే సౌకర్యాలు ఏ రకంగాను ఇప్పటికి తమకున్న సౌకర్యాలతో పోల్చలేమని వారికి అర్థ మయ్యింది.

కార్మికసంఘాలు ప్రయివేటికరణను, కార్మికచట్టాల సంస్కరణలను వ్యతిరేకిస్తున్నాయి. అన్ని కేంద్ర కార్మిక సంఘాలు జూలై రెండున ఢిల్లీనగరంలో కలసి ఓ నిర్ణయానికి వచ్చాయి.

(మిగతాది 12వ పేజీలో)

(8వ పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం జనవరి 8వ తేదీన సత్యాగ్రహాలు చెయ్యాలనీ, ఫిబ్రవరి 26న పార్లమెంటు భవనానికి కవాతు వెయ్యాలని నిర్ణయించుకున్నాయి. బి.ఎమ్.ఎస్. సంస్థ ఆచరణలో భాగ స్వామ్యం కావడం లేదుగాని ఇతరసంఘాల ఆలోచనతో ఏకీభవించింది.

ఈ రకమయిన చారిత్రక సందర్భంలో సింగరేణి కార్మికులు 'సింగరేణి పరిరక్షణ సమితి' ని ఏర్పరుచుకుని సమ్మెకు దిగారు. ప్రభుత్వం తన కాంట్రాక్టు విధానాలను కొనసాగించడానికి ధృడ నిశ్చయం ఉంది. విపరీతమయిన అణచివేత పద్ధతులు కొనసాగించి సమ్మెను తుంచివేయాలని ప్రయత్నించింది. వందలాది కార్యకర్త లను, మద్దతుదార్లను అరెస్టు చేసింది. తప్పుడు కేసులు బనాయించి పనివారి గుడిసెలకు, ఇళ్ళకు విద్యుత్ కట్ చేసింది.

ఈ సమ్మె ప్రత్యేకత ఏమంటే మామూలుగా జరిగే సమ్మెల్లో జీతభత్యాల వంటి సమస్యలు ప్రధానంగా వుంటూండగా, ఈ సమ్మె కార్మికులను తొలగించడానికి తోడ్పడే సర్ఫేస్ మైనర్ అనే యంత్రాన్ని వాడడమే. యంత్రాన్ని వాడడమే కాకుండా, ఆ పనికి సింగరేణి కార్మికులను ఉపయోగించకుండా కాంట్రాక్టరుకు అప్పగించటంతో అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది. బయటి వారి సేవలను వినియోగించటం యాజమాన్య హక్కు అని యాజ మాన్య ప్రభుత్వం వాదిస్తుండగా, వాటిని సింగరేణి కార్మికులతోనే పనిచేయించాలని కార్మిక సంఘాల వాదన. ఒక సారి కాంట్రాక్టర్ల అవకాశం ఇస్తే ఇంకా ఎన్నెన్నో పనులకు కాంట్రాక్టర్లనే నియమిస్తారని కార్మిక సంఘాల ఆందోళన.

ఈ సమస్యే సమ్మె 14 రోజుల పాటు కొనసాగడానికి కారణ మైంది. బొగ్గు ఉత్పత్తి 7.7ల.ట.నుంచి 30.8ల.ట.కు పెరిగిందంటే, అలాగే 88-89లో 378 సమ్మెలు జరిగిన సంగరేణిలో 2001-02 సంవత్సరంలో 46కు తగ్గి బొగ్గు ఉత్పిత్తి 7.7 లక్షల టన్నుల నుంచి 30.8 లక్షల టన్నులకు పెరిగిందంటే కేవలం కార్మికుల కృషే.

(మిగతా 22వ పేజీలో)

స్వయం ఉపాధిని కూడా దెబ్బతీస్తున్న ప్రభుత్వ విధానాలు

- వి. పరశురాములు

సింగరేణి కార్మికుల సమ్మె జరిగింది. ప్రభుత్వం, పత్రికలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అన్నీ బిజీ బిజీ అయి పోయాయి. బిజీకావటంతో పాటు వారంతా ముక్త కంఠంతో ఐకమత్యంగా ఆందోళన సాగించడం, అది కూడా బొగ్గులాంటి కీలక పరిశ్రమలో కావటంతో అందరి దృష్టిని ఆకర్షించింది. కాని అంతకన్నా ఎంతో ఎక్కువ మంది శ్రమ చేస్తున్నా, వారి సమస్యలు పట్టించుకొనే వారూ లేరు. ఆ సమస్యల మీద వారు ఆందోళన చేసినా గుర్తించే వారూ లేరు. వారు పని చేయకపోతే మనందరికీ పూట గడవదు. వారే వృత్తి దారులు.

వృత్తిదారులంటే కేవలం రజకులు, క్షురకులు, చేనేత కార్మికులు మాత్రమే కాదు. వారి పట్టిక చదివితే మనకే ఆశ్చర్యం కలుగుతుంది. హస్తకళాకారులు, పారిశుధ్య కార్మికులు, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, కంసాలి, మత్స్యకారులు, చర్మ కారులు, తాటాకు ఆకులతో బుట్టలు తయారు చేసే వారు, చిన్న చిన్న మట్టి బొమ్మలు, కొయ్యబొమ్మలు, పూల కుండీలు, మట్టికుండలు తయారు చేసేవారు, గాజు, పింగాణీ వస్తువులు, పశువుల తోళ్లనుంచి సంచులు, కొమ్ముల నుండి బొమ్మలు, దువ్వెనలు, బంజారా అద్దాల దుస్తులు, భరిణెలు తయారీదారులు, సముద్ర గవ్వలు, శంఖాలు, పూసలు సేకరించి పలు రూపాలలో వస్తువుల తయారుదారులు, ఇత్తడి, రాగి బిందెలు, చెంబులు, గంగాళాలు, కంచాల లాంటి గృహోపకరణ వస్తువులు తయారు చేసేవారు- వీరందరూ అసంఘటిత కార్మికులు. వీరు కాక కళాత్మక వృత్తులు కొన్ని వున్నాయి. రాళ్లతో బొమ్మలు చెక్కడం, లేసులు, శిల్పాలు, చిత్రాలు లాంటి హస్త కళాకారులున్నారు. వాయిద్య కారులు, గొర్రెలు, మేకల పెంపకం దార్లు గణనీయమైన సంఖ్యలో వున్నారు. ఇవికాక కొన్ని వృత్తులు అంతరిస్తున్నాయి. వీరు ప్రధానంగా గ్రామ సీమల్లో కనపడుతుంటారు. బుడిగ జంగాలు, మంద హెచ్చులు, దాసర్లు, గంగిరెద్దుల వాళ్లు అనేక మంది వున్నారు. అసంఘటిత కార్మికులు, కళాకారులు దారిద్రపుటంచుల్లో జీవిస్తున్నారు. వారికి రుణాలు దొరకవు. పూర్తిగా పని లభించదు. మార్కెట్ మొదలే లేదు. వృత్తులను కొనసాగించడానికి అవసరమైన మౌలిక సౌకర్యాలు మృగ్యం. వారి మొర వినే వారు లేరు. మండలాధికారి వద్దకు వెళ్లడమే కష్టం. అర్జీ ఎలా రాయాలో తెలియదు.

వృత్తిదారులు ఎవరికి వారు అక్కడక్కడ సంఘాలు పెట్టుకొని వారివారి పరిమితుల్లో వారి కష్టాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొని రావటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆధునికత చోటు చేసుకోవటంతో ప్లాస్టిక్, స్టీలుతో రకరకాల వస్తువులు తయారు చేస్తూండడం, రెడిమేడ్‌గా అనేక గృహావసరాలు మార్కెట్‌లో లభించటంతో కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, చేనేత లాంటి వృత్తుల్లో వున్న వారి పొట్టకొడుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రభుత్వ అనాసక్తత, విధానాలు తోడయ్యాయి.

ఉదాహరణకు గతంలో లేపాక్షి ఎంపోరియం ప్రభుత్వంచే గుర్తింపబడిన సహకార సంఘాల ద్వారానే కళా ఖండాలను కొనుగోలు చేసి బిల్లులు సకాలంలో చెల్లించేవి. ఈ పద్ధతికి ప్రభుత్వం స్వస్తి చెప్పి కొంత కాలంగా కన్సయిన్‌మెంటు పద్ధతిలో సరుకును తీసుకొని, వస్తువులు అమ్మిన తర్వాతనే అమ్మిన సరుకు లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారు. సహకార సంఘాలను పక్కన పెట్టి, కళాకారులు కాని కొందరు వ్యక్తిగత వ్యాపారులకు సైతం అనుమతి ఇచ్చి కమీషన్లు తీసుకొంటూ ప్రయివేటు వ్యక్తులకు పెద్దపీట వేస్తున్నారు. హస్తకళలో ఏ మాత్రం అనుభవం లేని కొందరు డబ్బుగల వ్యక్తులు పెట్టుబడి పెట్టి ఎంతో నైపుణ్యం గల కళాకారుల చేత కూలికి వస్తువులు చేయించుకొంటున్నారు. లేపాక్షి యాజమాన్యంతో ఇలా కుమ్మక్కై అధిక లాభాలతో వీరు కళను వ్యాపారం చేస్తూంటే కొందరు అధికారులు కూడా వీరికి వంత పాడుతున్నారు. ఉదహరణకు ఒక లేపాక్షి ఎంపోరియం ఒక నెలలో ప్రయివేటు వ్యక్తుల వస్తువులు ఏభైవేల రూపాయల దాకా అమ్మితే సహకార సంఘాల వారి వస్తువులు పదివేలు దాటలేదు.

పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం లేసుల అల్లికలకు ప్రసిద్ధి. అనేక దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. రెండు లక్షలమంది స్త్రీలు ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ లేసుల అల్లిక మీద జీవిస్తున్నారు. భారతదేశ వస్త్ర పరిశ్రమలో అల్లకం వస్త్ర ఉత్పత్తి 14 శాతం వుంది. విదేశీమారకాన్ని ఆర్జిస్తుంది. ఈ మహిళలు చెప్పేదేమంటే "అరకిలో బండిల్ దారాన్ని లేసు అల్లితే వ్యాపారస్తులు 40 రూపాయలు మంజూరీ ఇస్తున్నారు. ఒక బండిల్ దారం అల్లడానికి కనీసం వారం పడుతుంది. రోజుకు 10 లేక 12 గంటలు పని చేస్తున్నాం. అయినా మాకు వచ్చేది అంతే. అంటే గంట పనికి 50 పైసలు కూలీ పడు

తుంది. ఇష్టమైతే చేయండి, కష్టమైతే మానుకోండనే ధోరణిలో వ్యాపారస్తులు వ్యవహరిస్తున్నారు. దీనితో మజూరీ పెంచమని అడగడానికి కూడా ఆస్కారం లేక పోతోంది." కనీస వేతనాల బోర్డు ఈ లేసు వృత్తిని పరిగణనలోకి తీసుకుందో లేదో తెలియదు. పరిస్థితి ఇంత దారుణంగా వుండగా పులిమీద పుట్రలా సంస్కరణల మాటున అల్లిక మిషన్లు వచ్చాయి. వందమంది పనిచేసే పనిని ఒక్క మిషన్ చేస్తుందని మహిళలు ఆందోళన చెందుతున్నారు.

చేనేత రంగానికి అప్పెరల్ పార్కులే శరణ్యం అని అధికారులంటున్నారు. కాని గుండ్లపోచంపల్లిలో 119 యూనిట్ల స్థాపనకు మౌలిక సదుపాయాలు కల్పించినప్పటికీ కేవలం ఆరే పని చేస్తున్నాయని ఒకపక్క అంగీకరిస్తూనే ప్రభుత్వం మరోపక్క చేనేత రంగాన్ని ఉద్ధరించడానికి మరో రెండు అప్పెరల్ పార్కులు, 12 టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించటం విడ్డూరం. ఇప్పటికే దేశంలోని వస్త్రరంగంలో చేనేత తొమ్మిది శాతమని, పవర్ మగ్గాలు 69 శాతమని గణాంకాలు చెబుతున్నాయి. పవర్ మగ్గాలు వచ్చి చేనేత కార్మికుల నోటి దగ్గర కూడును దెబ్బతీసాయి. ఉదాహరణకు నల్గొండ జిల్లాలో ఫర్నిషింగ్ వస్త్రాలు తయారవుతున్నాయి. పవర్ మగ్గాల రంగంలో వినియోగించే పాలియెస్టర్ నూలు పైన, వస్త్రంపైన ఎక్సయిజు సుంకం రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం, చేనేత రంగానికి ఎటువంటి సహాయం అందించకపోగా 1989వరకూ ఇస్తూ వచ్చిన సహాయాన్ని క్రమంగా తగ్గించింది. అంతేకాక 2000 నుండి చేనేత పరిశ్రమలో వినియోగించే చిలప నూలుపై ఎక్సయిజు సుంకం విధించి చేనేతను దెబ్బతీసింది. ఆప్కో సంస్థకు సంబంధించి 1992-93లో రు.128.41 కోట్ల వ్యాపారం జరగగా 2000-01 నాటికి రు. 20.38 కోట్లకు పడిపోయింది. అలాగే కొనుగోలు రు. 112.45 కోట్లనుంచి కేవలం రు.6.3 కోట్లకు తగ్గిపోయింది. ఈ పరిస్థితులను అధిగమించాలంటే మారుతున్న అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు మారాలని అధికారులు పది, పదిహేను సంవత్సరాలుగా అదేపాట పాడుతున్నారు గాని ప్రభుత్వం, లేదా ఆప్కో సంస్థ ఆ వైపుగా ఏం చేసిందో తెలియదు. ఏదో ఒకటో రెండో ట్రెయినింగ్ సెంటర్లు ఏర్పాటు చేసినంత మాత్రాన సమస్య పరిష్కారమై పోతుందా?

మన అధికారుల పరిష్కారాలు విచిత్రంగా వుంటాయి. కల్లుగీత గీయడానికి, చెట్టెక్కడానికి యంత్రాలు సరఫరా చేస్తారట. యంత్రాలు కరెంటుతో పని చేస్తాయి. మన గ్రామాల్లో కరెంటు సరఫరా ఎలా వుందో తెలుసు. చెట్టు ఎక్కి సగంలో వుండగా కరెంట్ పోతే? గీత కార్మికుని వాటాగా చాలా చెట్లు వుంటాయి. ఒక్కో చెట్టుకు ఒక్కో యంత్రం కొనాలా? గీత కార్మికునికి సాధ్యమేనా? అనారోగ్యకరమైన కల్లును రకరకాల రసాయనాల, విష పదార్థాలతో కల్తీ చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలు హరించేందుకు మాఫియా కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తూంటే వారి మీద చర్య తీసుకోక పోగా తాగడును ప్రోత్సహించే ప్రభుత్వాన్ని ఏమనాలి?

వాయిద్య కళాకారులు భుక్తికోసం తమ వాయిద్య పరికరాలతో నలుమూలలా ప్రయాణిస్తుంటారు. ఇటీవల ఆర్.టి.సి. లగేజి ఛార్జీలు పెంచడంతో డోలుకు 18 రూపాయలు లగేజి డిమాండు చేశారు. మరో బస్సులో కండక్టరు 21/-లు వసూలు చేశాడు. మేనేజింగ్ డైరెక్టర్ దాకా వెళ్ళి సమస్యను పరిష్కరించుకోవాల్సి వచ్చింది. పగటిపూట వాయించడానికి పర్మిషన్ కావాలని పోలీసులు వేధిస్తున్నారు.

గొర్రెలు, మేకలు పెంచే వారికి ఓ గ్రేజింగ్ పాలసీ పెట్టి పశు వైద్య శాలల్లో యూజర్ ఛార్జీలు వసూలుచేసి, అలాగే నీరు, భూమి, చెట్లు పరిరక్షణ లాంటి చట్టాలు తీసుకొచ్చి అటు జీవాల మెడకు, ఇటు పెంపకం దారుల మెడకు ఉచ్చు బిగిస్తున్నారు. జీవాలను పశు వైద్య శాలకు తీసుకొని వెళ్లి కేసు నమోదు చేస్తే రు.15లు, సూది వేస్తే 10 రూపాయలు, ఆపరేషన్ చేస్తే రు.200లు, ఫీజులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానం ప్రపంచబ్యాంకు సలహా మేరకే తీసుకొని వస్తున్నామని శాసన సభ సమావేశాల్లో మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు.

మత్స్యకారులది మరో కథ, వారిపై టూరిజం పేరుతో బహుళజాతి కంపెనీల పేరుతో, విదేశీ ట్రాలర్స్ పేరుతో దాడులు జరుగుతున్నాయి. రొయ్యల సీడ్ వేటను మత్స్యకారుల సహకార సంఘాలకివ్వకుండా వేలం ద్వారా మధ్య దళారిలకు, స్మగ్లర్లకు అనుకూలం విధానాన్ని ప్రవేశ పెట్టింది. వేలం పాట ద్వారా ప్రభుత్వానికి అధిక ఆదాయం వస్తుందనే డబ్బు యావ తప్ప, వేలాది మత్స్యకారుల జీవితాల గురించి ప్రభుత్వానికి పట్టకపోవటం చూస్తే పేదల గురించి గ్లిసరిన్ కన్నీరు కారుస్తుందని విదితమవుతుంది. కొంతమంది శాసనసభ్యులు ఈ మధ్య దళారీలకు వంత పాడడం దురదృష్టకరం.

గోదావరి బ్యారేజ్ వద్ద ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ బ్యారేజ్ దగ్గరనే వందలాది మత్స్యకారులు భార్యాబిడ్డలతో అక్కడే భోజనాలు వండుకొని అక్కడే తింటూ పగలూ రాత్రి కాపలా కాసారు. కాని మత్స్యకారులపై దళారీలు పోలీసులతో ఇరిగేషన్ అధికారులతో దాడులు చేయించారు. పోని చెరువుల్లో చేపలు పట్టుకొందామంటే మేట వేసిన, నీరు లేని చెరువులు దర్శనమిస్తునాయి. అయినా పన్ను చెల్లించాలని సహకార సంఘాలకు నోటీసులు జారీ అవుతున్నాయి.

ఇవన్నీ కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీరంతా అసంఘటిత రంగాల్లో వుండటం వలన తమ సమస్యలను వారి సంఘాలు బలంగా వున్నచోటే పరిష్కరించుకోగలుగుతున్నారు. వృత్తిదారులు ఏ వృత్తికావృత్తిగా సంఘాలు పెట్టుకొనే కన్నా, వృత్తిదారుల సంఘాలన్నీ సమైక్యంగా నిలబడితేనే తమకు రక్షణ వుంటుందని భావించి ఆ మార్గంలో పయనం ప్రారంభించారు. ప్రభుత్వం వీరి కదలికలను, ఆందోళనలను గమనిస్తూనే వుండాలి. బట్ట చిరుగు చిన్నదిగా వున్నపుడే కుట్టువేస్తే ఆ బట్టను ఎక్కువకాలం వాడుకోవచ్చు. చిరుగు పెద్దదైతే ఏం చేయలేం. ఈ విషయాన్ని ప్రభుత్వం గమనిస్తుందనే ఆశించాలి. ❐

ఆర్.టి.సి నష్టాలు యాజమాన్యం స్వయంకృతాపరాధమే

-యం.యన్.రెడ్డి

1958 జనవరి 11న 609 బస్సులు 16 డిపోలు, 5081 మంది సిబ్బందితో ప్రారంభమైన ఆర్టీసి దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెంది 2001 జులై నాటికి 19319 బస్సులతో 213 డిపోలు, 1,28,239 మంది సిబ్బందితో రోజుకు 1 కోటి 10 లక్షల ప్రయాణీకులను చేరవేసే స్థితికి ఎదిగింది. "గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్" రికార్డులకెక్కింది. అతి తక్కువ ప్రమాదాలు, ఫెయిల్యూర్స్, వాహన, యిందన వినియోగం తదితర అనేక అంశాలో ఏపియస్ఆర్టిసి దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. 1996-97 నాటికి అప్పులలో అత్యధికభాగం తీర్చివేసి లాభాలలో నడచి, దేశంలోనే అత్యంత సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణా సంస్థగా పేరెన్నికగాంచింది.

రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పోరేషన్ చట్టం 1950 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీలకు 1:2 నిష్పత్తిలో క్యాపిటల్ కంట్రిబ్యూషన్ ఇవ్వాలి. కాని 1988 నుండి క్యాపిటల్ కంట్రిబ్యూషన్‌ను నిలిపివేశాయి. 1988 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టిసీకి యిచ్చిన క్యాపిటల్ కంట్రిబ్యూషన్ కేవలం 201 కోట్ల రూ॥ మాత్రమే. ఆ తరువాత ప్రభుత్వం తన బడ్జెట్‌నుండి ఒక్కపైసా గూడా ఆర్టీసిపై ఖర్చుచేయనప్పటికి, ఆర్టీసి తన అంతర్గత వనరులను (ఉద్యోగులు దాచుకున్న కోట్లాదిరూపాయలు, బ్యాంకులు, ఎల్ఐసి లాంటి ఆర్థిక సంస్థల సహకారం) వినియోగించుకొని మార్కెట్ ధరల ప్రకారం 5వేల కోట్లకు తన ఆస్తులను పెంచుకొనగలిగింది. ఈ అభివృద్ధికి ఉద్యోగుల శ్రమ, అధికారుల మేధస్సు, మాత్రమే కారణమని చెప్పక తప్పదు.

గణనీయమైన అభివృద్ధి సాధించిన ఆర్టీసిని, ప్రభుత్వం, ప్రపంచబ్యాంకు షరతులలో భాగంగా నష్టాలలోకి నెట్టింది.

నష్టాలు రావటానికి ప్రధానంగా మూడు కారణాలున్నాయి.

(1) మోటారు వాహనాల పన్నులను ఆర్టీసినుండి అధికంగా వసూలు చేయటం.

(2) వివిధ వర్గాల ప్రయాణీకులకు ప్రభుత్వం ప్రకటించే రాయితీల భారాన్నీ ఆర్టీసిపై మోపడం

(3) ఆర్టీసి రూట్లలో ప్రవేటు వాహనాల అక్రమ రవాణాను అరికట్టకపోవడం. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వ విధానాల మూలంగా వస్తున్న నష్టాలు.

మోటారు వాహనాల పన్నులు : 1994-95 సంవత్సరం వరకు మోటారువాహనాల పన్ను ప్రవేటువారికి, ఆర్టీసికి ఒకే విధంగా ఉండేది. ఆర్టీసి నుండి ఎక్కువ పన్నులు తీసుకొనుటకు గాను రాష్ట్ర ప్రభుత్వం 1995లో ఒక కొత్త జి.ఓ.ను తీసుకొచ్చి ఆ జి.ఓ ప్రకారం 2000 బస్సులు కలిగిన ఏ ఓనరు అయినా తనకు వచ్చే రోజువారి ఎర్నింగ్స్‌పై 15% పన్ను కట్టాలి. ఈ జి.ఓ. కేవలం ఆర్టీసిని దృష్టిలో పెట్టుకొని తీసుకొచ్చింది మాత్రమే.

పాత టాక్సుల విధానం ప్రకారం సంవత్సరానికి ఒక బస్సుకు 81 వేల రూపాయలు పన్నును చెల్లించితే అది 2001 కి ఇచ్చేసరికి 2 లక్షల రూపాయలకు పెరిగింది. టాక్సులు ఏవిధంగా పెరిగాయో ఈ క్రింది పట్టికను చూస్తే అర్థమౌతుంది.

మార్చిన పన్నుల విధానం వల్ల గడచిన 7 సంవత్సరము లలో 869 కోట్ల రూపాయలను ఆర్టీసి ఆదాయంలనుండి రాష్ట్రప్రభుత్వ ఖజానాకు తరలించబడ్డాయి.

సంవత్సరం	బస్సుల సంఖ్య	95కు పూర్వం పన్నుల విధానం ప్రకారం కట్టవలసిన పన్ను కోట్లలో	95 తర్వాత మారిన పన్నుల విధానం ప్రకారం కట్టిన పన్ను కోట్లలో	తేడా కోట్లలో	95 పూర్వం బస్సు ఒక్కంటికి రూ॥ 81 వేలు పన్ను చెల్లించితే తరువాత కాలలో ఈ క్రింది విధంగా పెరిగింది.
95-96	15790	127	182	55	రూ॥ 1-15 లక్షలు
96-97	16488	133	248	115	రూ॥ 1-50 లక్షలు
97-98	17233	139	279	140	1.62 లక్షలు
98-99	18122	146	294	148	1.62 లక్షలు
99-2000	18562	150	334	184	1.80 లక్షలు
2000-2001	18946	153	380	227	200 లక్షలు

రాయితీలు : వివిధ వర్గాల ప్రయాణీకులకు యిస్తున్న రాయితీల భారం 1995-96లో 75 కోట్ల రూపాయలు ఉన్నది. అది 2000-2001 సంవత్సరానికి 234 కోట్లకు పెరిగింది. ఈ క్రింది పట్టిక పరిశీలించితే రాయితీలభారం ఎలాపెరిగిందోఅర్థమవుతుంది.

రాయితీల పట్టిక		
సంవత్సరం	రాయితీల భారం	పెరిగిన భారం (కోట్లలో)
95-96	75	
96-97	77	2
97-98	81	6
98-99	116	41
99-2000	163	88
2000-2001	234	159

అంటే అదనపు పన్నులు రాయితీల రూపంలో గత సంవత్సరము 1165 కోట్ల రూపాయలు ఆదాయాలను రాష్ట్ర ప్రభుత్వం కాటు వేసింది.

2002 నాటికి ఆర్టీసికి వచ్చిన నష్టం 800 కోట్లు మాత్రమే. అంటే పన్నులు రాయితీలు పెరిగినట్లయితే 1165-800=365 కోట్లు ఆర్టీసీ లాభాలలో ఉండేది.

2001లో చేసిన 24 రోజుల సమ్మె సందర్భంగా, పన్నులను, 15% నుండి 12.5%కు తగ్గించుటకు, రాయితీలను 260 కోట్లకు గాను 100 కోట్లను ప్రభుత్వం ఆర్టీసికి చెల్లించడానికి అంగీకరించింది. అయితే పెరిగిన భారంలో తగ్గించినది నామమాత్రమే.

ప్రభుత్వ విధానాలవలన వచ్చే నష్టాలను, కార్మికులను తగ్గించటం మూలంగాను, బస్సు చార్జీలు పెంచి ప్రయాణీకులపై భారాలు వేయటం మూలంగా తగ్గించాలని ప్రభుత్వం ఆర్టీసి యాజమాన్యం తీసుకొనే చర్యలు "కొండనాలుకకు ముందు వేస్తే ఉన్ననాలుక ఊడినట్లు" ఆర్టీసి పరిస్థితియింకా దిగజారుతున్నది. అయినప్పటికి కార్మికులను 2003 సం॥లోనే 24వేల మందికి వి.ఆర్.యస్. యిచ్చి ఇళ్ళకు పంపటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఇంతమంది కార్మికులను తగ్గించిన తరువాత ఆర్టీసి ఎలా బ్రతుకుతుంది.

అలాగే బస్సు ఛార్జీలు పెంచి ఆర్టీసి ప్రయాణీకులను ప్రైవేటు వాహనాలవైపుకు మళ్ళించటానికి, ప్రభుత్వం ఉపయోగ పడుతున్నది. ఈ క్రింది పట్టికను గమనించితే ఆర్టిసి సామర్థ్యం లాభనష్టాలు అర్థమౌతాయి. క్రింది పట్టికను పరిశీలిస్తే క్రింది విషయాలు అర్థమవుతాయి.

1. సిబ్బంది నారమ్స్ కుదించబడ్డాయి.
2. సిబ్బంది ఉత్పాదకత మరియు సామర్థ్యం పెరిగింది.

అయినప్పటికి లాభాలు రాకపోగా నష్టాలలో కూరుకుంది.

ప్రత్యామ్నాయాలు లేవా ?

రాష్ట్రంలో రైల్వేల అవసరాలకు వాడే డిజిల్ మీద అమ్మకపు పన్ను కేవలం 4శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తున్నది. కాని తన అధీనంలో ఉన్న ఆర్టీసి వాడే డిజిల్‌పై 19 శాతం వసూలు చేస్తున్నది. రైల్వే మాదిరిగా ఆర్టిసి కూడా 4 శాతం అమ్మకపు పన్నులు వసూతు చేస్తే ఆర్టిసికి సాలీనా 130 కోట్ల రూపాయలు ఆదా అవుతుంది.

మన రాష్ట్రంలో చట్ట వ్యతిరేకంగా పర్మిట్ రూల్స్ అధిక్రమించి సుమారు 70 వేల వాహనాలు ఆర్టీసి ఆదాయాన్ని లూటీ చేస్తున్నాయి. ఈ విషయాన్ని రవాణా శాఖామాత్యులు, ఆర్టీసి ఛైర్‌పర్సన్ ఇద్దరూ బహిరంగంగానే అంగీకరించారు. ఆచరణలో చట్టాన్ని ఉల్లంఘించే వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది.

24రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా ప్రయివేటు వాహనాల అక్రమ రవాణాను ఉక్కుపాదంతో అణచివేస్తానని

సంవత్సరం	డిజిల్ 1 లీ॥కు కి.మీ.	టైరు మన్నిక	ప్రమాదాల రేటు లక్ష కి.మీ.లకు	బస్ ఫేల్యూర్ రేటు 10 వేల కి.మీ.లకు	కార్మికుల ఉత్పాదకత	ఒక రోజుకు వాహన విని-యోగం కి.మీ.	వాహన వినియోగ శాతం	సిబ్బంది నారమ్స్	లాభాలు నష్టాలు (కోట్లలో)
95-96	4-98	1,21,000	0.19	0.36	40	306	97.34	7.53	+45.07
96-97	5.02	1,25,000	0.15	0.29	40	303	97.68	7.56	+6.32
97-98	5.05	1,27,000	0.14	0.23	41	311	98.28	7.40	-49.70
98-99	5.05	1,35,000	0.13	0.21	43	310	98.16	7.19	-98.64
99-2000	5.07	1,40,000	0.12	0.19	44	317	98.47	7.07	-151.85
2000-2001	5.07	1,46,000	0.10	0.25	45	320	98.93	695	-214.79
2001-2002	5.18	1,51,000	0.10	0.18	47	321	99.18	6.88	-270.34

ప్రభుత్వం రాతపూర్వకంగా హామీ ఇచ్చింది. అందుకు పేరుకు ఒక అత్యున్నత కమిటీని వేసింది. దాని వల్ల ఫలితం ఏమీ లేకపోయింది. పైగా సమ్మెకు ముందు 39వేల వాహనాలు అక్రమంగా తిరుగుతుంటే సమ్మె తరువాత అది 70వేలకు పెరిగాయి. దీనిని బట్టి ఉక్కుపాదం ఆర్టీసిపై పెడుతున్నట్లు అర్థమౌతున్నది.

ప్రైవేటు వాహనాల అక్రమ రవాణావలన ఆర్టీసి సాలినా 800 కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతుంది. రాష్ట్ర ప్రభుత్వం దాన్ని సమర్థవంతంగా అరికట్ట గలిగితే ఆర్టీసీకి నష్టాలు రావు, పెద్ద ఎత్తున లాభాలు వస్తాయి. ప్రభుత్వానికి కూడా పన్నుల రూపంలో 100 కోట్ల రూపాయిలకు పై అదనపు ఆదాయం వస్తుంది. ఆర్టీసికి మిగిలే 800కోట్లలో 400కోట్లు ఖర్చుచేసి 3000 బస్సులు కొనుగోలు చేయవచ్చును. అలా కొత్త బస్సులు ప్రవేశపెట్టడం వలన 20 వేలమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించవచ్చును. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగు అవుతాయి.

చట్టాన్ని కాపాడి అక్రమ రవాణాను అరికడితే ఇన్ని ప్రయోజనాలున్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం అందుకు సిద్ధపడుటలేదు. అంటే ఈ ప్రభుత్వానికి ఆర్టీసీ కంటే, ప్రజలకంటే ప్రపంచ బ్యాంకుకు యిచ్చిన మాట ముఖ్యం. ఆర్టీసీని నాశనం చేయటమే దీని లక్ష్యం.

ఆర్టీసిని లాభాపేక్షతో చూడటం సబబా

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఎంత బాగా అభివృద్ధి చెందితే ఆ దేశం ఆ రాష్ట్రం అంత అభివృది అవుతుంది. వ్యక్తిగత వాహనాలు ముఖ్యంగా ద్విచక్రవాహనాలు తగ్గుతాయి. ట్రాఫిక్ జాములు, తగ్గి విలువైన సమయం ఆదా అవుతుంది. కాలుష్యం తగ్గి ప్రజల ఆరోగ్యం బాగుపడుతుంది. ప్రమాదాలు తగ్గుతాయి. విదేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న చమురు వినియోగం తగ్గి వేలకోట్లరూపాయల విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుంది. ఇవన్నీ ప్రపంచ వ్యాపితంగా వివిద దేశం అనుభవాలు. అందుకే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టుకు వివిద పద్ధతుల్లో ప్రభుత్వాలు సహకారం అవసరమని ప్రపంచదేశాలన్నీ అంగీకరించాయి.

ఫ్రాన్స్‌లో కొత్త బస్సులు కొనుగోలుకు అయ్యే ఖర్చులో 25 నుండి 50 శాతం దాకా స్థానిక సంస్థలు భరిస్తాయి. బ్రిటన్‌లో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును బలపరచటానికి ప్రభుత్వం గ్రాంటు యివ్వాలని 1998లో నిర్ణయించింది. 50 మిలియన్ పౌండ్లలో ప్రారంభించి 60 పౌండ్లకు పెంచి కొనసాగిస్తున్నది స్విట్జర్లాండు, జర్మనీ, ఇటలీ, సింగపూర్‌లలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును విస్తరించ టానికి వివిధ చట్టాలు తెచ్చారు.

భారతదేశం ఇతర మూడవ ప్రపంచ దేశాలలో సంస్కరణల అమలుకై ఒత్తిడి చేస్తున్న అమెరికా తన దేశంలో అందుకు భిన్నంగా వ్యవహరించుతున్నది. "యునైటెడ్ స్టేట్స్ ట్రాన్స్‌పోర్టేషన్ ఈక్విటీ యాక్టపర్ ట్వంటీ ఫస్ట్ సెంచరి" పేర ఒక చట్టం చేసి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఖర్చులలో 20 శాతం తగ్గకుండా సాలీనా 19,800 కోట్ల డాలర్లు కేటాయిస్తున్నది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ప్రభుత్వానికి ఆదాయ వనరుగా చూడటం ప్రపంచంలో ఎక్కడా లేదు. కాని మన రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ నుండి మోటారు వాహనాల పన్నుల రూపేణా సాలీనా 400 కోట్ల రూపాయిలను తన ఖజానాకు తరలించుక పోతున్నది. ప్రభుత్వం అన్ని రకాల వాహనాలపై వసూలు చేస్తున్న పన్నులో ఆర్టీసి చెల్లించుతున్న పన్ను 43 శాతంగా ఉన్నది.

అనేకమంది మేధావులు యితర ఆర్టీసీలతో మన ఆర్టీసిని పోల్చి అధ్యయనం చేసారు. మానవ వనరులను మరియు కార్మికుల ఉత్పాదకతా శక్తిని బాగా వినియోగించుకొని సిబ్బంది ఖర్చును తగ్గించుకొనడం ద్వారా ఏ.పి.యస్. ఆర్టీసి మంచి ఫలితాలు సాదించిందని తెలిపారు. అయినప్పటికి సంస్థ నష్టాలలో ఉంది. ఈ పరిస్థితి మారాలంటే ఆదాయాలు పెంచు విదంగా ప్రయాణీకులను ఆకర్షించే మార్కెటింగ్ ఎత్తుగడలను అనుసరించడం, ప్రభుత్వం పన్నులను తగ్గించటం వంటివి ఆర్టీసి ముందు ఉన్నాయని వారు సూచించారు. కాని ప్రభుత్వం, ఆర్టీసి యాజమాన్యం వీటిలో దేనిని పరిగణనలోకి తీసుకొనకుండ, యింకా సామర్థ్యం పెంచుకోవాలనే తాపత్రయంతో సిబ్బందిని కుదిస్తే కండక్టర్లు డ్రైవర్లు లేక సర్వీసులు రద్దు అవుతాయి. మెకానికల్ సిబ్బంది కొరత కారణంగా బస్సు ఫెల్యూర్స్ పెరుగుతాయి. వీటిమూలంగా, అసమర్థపు బస్సులు యిక అవసరం లేదు. ప్రైవేటు బస్సులు కావాలనే వైపుకు వెళుతుంది. ప్రజల చేత ఆర్టీసి వద్దని అనిపించడమే ప్రభుత్వ ధ్యేయం.

ఆంధ్రరాష్ట్ర ప్రజల అవసరాలను తీర్చి, రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడుతున్న ఎ.పి.ఎస్.ఆర్.టి.సి. నిరీక్షించుకొన వలసిన అవసరం, కార్మికవర్గంపై మొత్తం ప్రజాజీవనంపై ఉన్నది. ❐

రచయిత ఏపియస్ఆర్టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు

ప్రపంచీకరణ - మన బాధ్యత

-రాబర్ట్ డబ్ల్యు మెక్‌షెస్నీ

ఈనాటి రాజకీయ, ఆర్థిక పరిస్థితి యొక్క సారాంశాన్ని ఒక్కమాటలో చెప్పాలంటే దాన్నే నయా సరళీకరణవాదం అని అనాలి. (నియోలిబరలిజం). వేళ్లమీద లెక్కపెట్టగలిగినంత కొద్దిమంది ప్రైవేట్ వ్యక్తులు తమ వ్యక్తిగత లాభాన్ని అత్యధికంగా పెంచుకోవడం కోసం సామాజిక జీవితం మీద ఎక్కువగా వీలైతే ఎక్కువగా పెత్తనాన్ని చెలాయించడానికి ఉపయోగించే విధానాలు, పద్ధతులను నియోలిబరలిజం తెలియజేస్తుంది. రీగన్, థాచర్‌లతో ఇది మొదలైంది. గత రెండు దశాబ్దాల కాలంలో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రభావం కల్గించిన రాజకీయ, ఆర్థిక ధోరణి యిది. దాదాపు అన్ని మితవాద, మధ్యేవాద రాజకీయ పార్టీలూ దీనిని అవలంబించాయి. అత్యంత సంపన్నులైన పెట్టుబడిదారుల యొక్క, ఒక వెయ్యిలోపే వున్న బహుళజాతి సంస్థల యొక్క ప్రయోజనాలకు యీ పార్టీలు, అవి అవలంబించిన విధానాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

కొద్దిమంది మేధావులు, వ్యాపారస్తులు మినహా తక్కినవారికి నియోలిబరలిజం అనే పదం తెలియదు. సాధారణ ప్రజలు ఈ పదాన్ని వాడరు. దానికి బదులుగా స్వేచ్ఛా మార్కెట్ విధానాలు అని ఉపయోగిస్తారు. ప్రైవేట్ వ్యక్తుల సాహసోపేతమైన చర్యలకు అవకాశం స్వేచ్ఛామార్కెట్‌లో వుంటుందని, వినియోగదారులకి ఎంచుకొనే వీలుంటుందని, వ్యక్తిగతంగా బాధ్యత వహించడానికి, చొరవ ప్రదర్శించడానికి తగిన ప్రతిఫలం లభిస్తుందని ప్రచారం అవుతోంది. అంతేగాక, చేతగాని, నిరంకుశులైన పరాన్నభుక్కులైన అధికార యంత్రాంగపు పెత్తనానికి స్వస్తి పలుకుతుందని, ప్రభుత్వం ద్వారా ఏ పనికొచ్చేపనీ జరగదని, చెయ్యాలనుకున్నా చేయలేరనే అభిప్రాయం బలంగా వుంది. ప్రైవేట్ పెట్టుబడిదారీ వర్గం సమకూర్చిన నిధులతో ఒక తరం పాటు సాగిన ప్రయత్నాల ఫలితంగా ప్రజాభిప్రాయాన్ని స్వేచ్ఛామార్కెట్‌కు సంబంధించిన పై అవగాహనకు సానుకూలంగా మార్చుకోగలగడమే గాక, ఆ పదాలకు ఒక పవిత్రతను, గొప్పదనాన్ని కూడా ఆపాదించగలిగారు. దీని ఫలితంగా స్వేచ్ఛా మార్కెట్ వాదులు ఏం గొప్పలు చెప్పుకున్నా వాటిని సవాలు చేసేవారే కరువయ్యారు. సంపన్నుల మీద విధించే పన్ను తగ్గించాలన్నా, పర్యావరణ రక్షణ కోసం ఏర్పరచిన నిబంధనల్ని పెట్టుబడిదారుల కోసం సడలించాలన్నా, ప్రజా విద్యావ్యవస్థనుగాని, సాంఘిక సంక్షేమ కార్యక్రమాల్ని గాని అమలు చేయకుండా విరమించుకోవాలన్నా, వీటిని సమర్థించుకోవడం ఏమంత కష్టం కాకుండా పోయింది. అన్నింటినీ స్వేచ్ఛామార్కెట్ విధానం పేరున అమలు చేయగలుగుతున్నారు. సరుకులను, సేవలను సక్రమంగా, సహేతుకంగా, న్యాయంగా, ప్రజాతంత్ర యుతంగా కేటాయించే ఏకైక సాధనం స్వేచ్ఛామార్కెట్ అని బలంగా చెప్పడం జరుగుతోంది. సమాజంపై పెట్టుబడిదారీ వర్గం చెలాయిస్తున్న ఆధిపత్యాన్ని ఆటంకపరిచే ఏ చిన్న చర్య అయినా ఒక నేరంగా ప్రజలముందు చిత్రీకరించబడుతోంది. స్వేచ్ఛా మార్కెట్ విధానానికి ఎట్టి ఆటంకమూ వుండరాదని వారు ప్రకటిస్తున్నారు. ఒక పక్క కొద్దిమంది సంపన్నులకు అనుకూలమైన చర్యలు చేపడుతూనే ఇంకొక పక్క తమ వాక్చాతుర్యంతో నియో లిబరల్ వాదులు తాము పేదలకు, పర్యావరణానికి, ప్రతీ ఒక్కరికీ ఎనలేని సేవలు చేస్తున్నట్లు చిత్రీకరించగలుగుతున్నారు.

అయితే యీ నియోలిబరల్ విధానాల ఆర్థిక పర్యవసానాలు అన్ని చోట్లా ఇంచుమించు ఒకేలా కనపడుతున్నాయి. సాంఘిక, ఆర్థిక అసమానతల్లో వ్యత్యాసం విపరీతంగా పెరిగింది. పేద దేశాల సంపదను కొల్లగొట్టే వేగం పెరిగింది. భూమి మీద పర్యావరణం వినాశకరంగా మారుతోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్థిరంగా తయారైంది. సంపన్నులు మాత్రం ఎన్నడూ చూడనంత సంపదలను చేజిక్కించుకోగలుగుతున్నారు. ఈ వాస్తవాలను నియో లిబరల్ వాదుల ముందుంచి నిలదీస్తే వారేమంటున్నారు? ఇన్ని సమస్యలకూ మూలకారణమైన తమ నియోలిబరల్ విధానాల జోలికి ఎవరూ పోకుండా వుంటే తాము దోచుకుని అనుభవిస్తున్న సంపదలో ఒక్క చిన్న భాగాన్ని విస్తార ప్రజానీకానికి అందిస్తామంటున్నారు.

నియోలిబరల్ వాదులు ప్రపంచాన్ని ఇలా తయారు చేయడం సరైనదేనని చెప్పి, తమని సమర్థించుకోవడానికి తోడ్పడే ఏ అనుభవాలూ చూపలేరు. కాని వాస్తవ ప్రపంచంలో ఎట్టి సంబంధములేని, 19వ శతాబ్దం నాటి స్వేచ్ఛామార్కెట్ సిద్ధాంతాలు తిరుగులేనివిగా, ప్రశ్నించవీలులేనివిగా మనం అంగీకరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నియోలిబరల్ వాదులు చేతుల్లోని తురుపుముక్క ఏమంటే స్వేచ్ఛామార్కెట్ విధానానికి ఇంకో ప్రత్యామ్నాయం ఏదీలేదని, కమ్యూనిస్టు సమాజాలు, సోషల్ డెమోక్రసీలు, సంక్షేమరాజ్యాలు అన్నీ విఫలం అయ్యాయని, అందుకనే ప్రజలు నియోలిబరలిజాన్నీ స్వీకరించారని వారు చెప్పుకుంటున్నారు. స్వేచ్ఛా మార్కెట్ విధానంలో కొన్ని లోపాలు వున్నప్పటికీ, అదొక్కటే ఆచరణ సాధ్యమైనదని వారు ప్రకటిస్తున్నారు.

ఇరవయ్యో శతాబ్దంలో కొందరు విమర్శకులు పెట్టుబడి దారీ విధానానికి వున్న (ప్రజాస్వామ్యం అనే) ముసుగును

తొలగించుకొని బైటపడ్డ వ్యవస్థగా ఫాసిజాన్ని అభివర్ణించారు. ఎట్టి ప్రజాస్వామ్య హక్కులు గాని, ప్రజాతంత్ర సంస్థలుగాని మనడానికి వీలులేని పూర్తి పెట్టుబడిదారీ విధానం పేరే ఫాసిజమని వారు అన్నారు. కాని, నిజానికి ఫాసిజం అన్న పదానికి అంతకంటే లోతైన, సంక్లిష్టమైన అర్థం వుంది. ప్రజాస్వామ్య ముసుగుని తొలగించుకొని బైటపడ్డ పెట్టుబడిదారీ విధానంగా మనం నియోలిబరలిజాన్ని చెప్పవచ్చు. వ్యాపార వర్గాలు మరింత బలంగా, మరింత దాడిచేసే ధోరణిలో వ్యవహరిస్తూ అత్యంత బలహీనమైన సంఘటిత ప్రతిఘటనను ఎదుర్కొనే యీ నాటి శకానికి నియోలిబరలిజం ప్రతినిధి. ఈ రాజకీయ వాతావరణంలో ప్రతీరంగం మీద వారి ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోడానికి వారు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల పెట్టుబడిదారీ వర్గాన్ని సవాలు చేయడం ప్రజాతంత్ర శక్తులకు దాదాపు అసాధ్యం అవుతున్నది.

స్వేచ్ఛా మార్కెట్‌ను వ్యతిరేకించే శక్తులను అణచివేసే క్రమంలో నియోలిబరలిజం కనపడుతుంది. ఇక్కడే ఫాసిజానికీ, నియోలిబరలిజానికీ వున్న తేడా బైటపడుతుంది. ఫాసిజం ప్రజాస్వామ్య వ్యవస్థను సహించలేదు. ఫాసిజం జాత్యహంకారం, జాతీయ దురభిమానం వంటి ఉద్రేకాల పై రెచ్చగొట్టబడ్డ సాంఘికో ద్యమాల మీద ఆధారపడుతుంది. దానికి విరుద్ధంగా నియో లిబరలిజం బాగా శక్తివంతంగా పనిచేయాలంటే పేరుకు ప్రజా స్వామ్య విధానం వుండాలి. ఎన్నికల ద్వారాప్రభుత్వాలు ఏర్పడాలి. కాని విధానాల రూపకల్పనలో ప్రజలు అర్థవంతమైన పాత్ర నిర్వహించడానికి, వారికి అందుబాటులో వుండవలసిన సమాచారాన్ని, చర్యలకు అవసరమైన వేదికలను వారికి లభించ కుండా చేస్తుంది. ప్రజానీకాన్ని పక్కకు మళ్ళిస్తుంది. నియోలిబరలి జానికి గురువు మిల్టన్ ఫ్రెడ్‌మన్. 'పెట్టుబడిదారీ విధానమూ - స్వేచ్ఛా' అన్న అతని గ్రంథంలో ప్రజాస్వామ్యం యొక్క సారాంశం లాభార్జనే అని, స్వేచ్ఛామార్కెట్ విధానానికి వ్యతిరేకమైన పాలసీలను అమలు జరిపే ప్రభుత్వానికి ఎంత మెజార్టీ వున్నా ప్రజలలో ఎంత పలుకుబడివున్నా అది ప్రజాస్వామ్య వ్యతిరేక ప్రభుత్వమే అవుతుదని పేర్కొన్నాడు. కనుక వ్యక్తిగత ఆస్తిహక్కును రక్షించడానికి, కాంట్రాక్టుల అమలును గ్యారంటీ చేయడానికి, అల్పమైన సమస్యల పైనే రాజకీయ చర్చలు జరిగేటట్టు చూడడానికి మాత్రమే ప్రభుత్వం యొక్క పాత్రను పరిమితం చేయాలని చెప్పారు. ఉత్పత్తి, పంపిణీ, సామాజిక నిర్మాణాల నిర్వహణ వంటి కీలక విషయాలను నిర్ణయించే పని మార్కెట్ శక్తులకే వదిలిపెట్టాలని దాని సారాంశం.

ప్రజాస్వామ్యం గురించి యిట్టి వికృతమైన అవగాహన కలిగి వున్నారు. గనుకనే ఫ్రైడ్‌మన్ వంటి నియోలిబరల్ వాదులు 1973లో చిలీలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అలెండీ ప్రభుత్వాన్ని మిలిటరీ కూలదోసినపుడు, ఆకూల్చివేతను సమర్థించడానికి ఏ మాత్రమూ వెనుకాడలేదు. చిలీలోని మార్కెట్ నిర్వహణలో అలెండీ జోక్యం కల్పించుకుంటున్నాడు గనుక అతని ప్రభుత్వాన్ని కూల్చివేయడం సమర్థనీయమేనని వారి వాదన. ఆ తర్వాత చిలీలో 15 సంవత్సరాలపాటు అత్యంత పాశవికమైన, అనాగరికమైన నియంతృత్వపాలన ప్రజాస్వామ్య స్వేచ్ఛామార్కెట్ పేరుతో సాగింది. 1989లో అక్కడ మొక్కుబడిగా ప్రజాస్వామ్యం పునరుద్ధరించ బడింది. ఆ సందర్భంగా అమలులోకి వచ్చిన కొత్త రాజ్యాంగం పరిధిలో చిలీలోని సమాజంపై వ్యాపార-మిలిటరీ కూటమి యొక్క పెత్తనాన్ని పౌరులు సవాలు చేయడం చాలాకష్టంగా మారింది. క్లుప్తంగా చెప్పాలంటే నియోలిబరల్ ప్రజాస్వామ్యం అంటే ఇదే. అవే స్వేచ్ఛా మార్కెట్ విధానాలను అమలు చేసే వివిధ రాజకీయ పార్టీలు, అప్రధానమైన సమస్యలపై తీవ్రంగా వాదించుకుంటూ ప్రజల దృష్టి మళ్లించజూస్తుంటాయి.

ప్రజా ప్రయోజనాలకనుగుణంగా మార్కెట్‌ను మార్పు / అదుపు చేయాలనే యోచన చేయనంతకాలం ప్రజాస్వామ్యం అనుమతించబడుతుంది. దానర్థం ప్రజాస్వామ్యం దాని అసలైన అర్థంలో అనుమతించబడదు.

నియోలిబరల్ విధానంలో ముఖ్యమైన, తప్పనిసరైన ఉప ఉత్పత్తి ఒకటి తయారవుతుంది. నిర్లిప్తత, నిరాశతో వున్న రాజకీయ రహితమైన పౌరులే ఆ ఉప ఉత్పత్తి. ఎన్నికల ద్వారా వచ్చే ప్రభుత్వం వల్ల సామాజిక జీవితంలో పెద్దగా మార్పుమీ వుండ నపుడు, ఆ ఎన్నికలకు అంత ప్రాధాన్యత నివ్వడం అనవసరం, అని భావించడం దీనిలో భాగమే. నియోలిబరల్ ప్రజాస్వామ్యానికి పునాది అయిన అమెరికాలో 1998 ఎన్నికలలో కేవలం 1/3 వంతు ఓటర్లు మాత్రమే తమ ఓటు వినియోగించుకున్నారు. పేదల ఓట్లు మీద ఎక్కువ ఆధారపడే డెమాక్రటిక్ పార్టీ వంటివి ఈ ధోరణిపై అప్పుడప్పుడు ఆందోళన వ్యక్తం చేసినా, మొత్తంమీద పెత్తనం చెలాయిస్తున్న వర్గాలు ఓటు హక్కు వినియోగించుకొనేవారి సంఖ్య తగ్గిపోవడాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఎందుకంటే ఓటు హక్కు వినియోగించుకోనివారిలో అత్యధికులు పేదలు, కార్మికులు, వారిలో కుతూహలాన్ని, ఓటింగ్ శాతాన్ని పెంచగల పాలసీలను బహిరంగ చర్చకు రానివ్వకుండా ముందే తొక్కెయ్యడం జరుగు తుంది. అమెరికాలోని పెట్టుబడిదారీ వర్గ పార్టీలైన రెండు ప్రధాన పార్టీలూ కొత్త రాజకీయ పార్టీల ఏర్పాటుకు అవరోధంగా వున్న చట్టాలను సవరించడానికి తిరస్కరించాయి. రిపబ్లికన్ పార్టీ, డెమొక్రటిక్ పార్టీలు రెండింటిపైనా తరచు ప్రజల్లో అసంతృప్తి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నాయి. పోటీ, ఎంచుకొనే స్వేచ్ఛ కల్పించే స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థలో ఎన్నికలలో మాత్రం ఓటర్లకు నిజమైన స్వేచ్ఛ అక్కడలేనేలేదు.

అయితే నియోలిబరలిజం యొక్క 'నాగరిక' రాజకీయ సంస్కృతి యొక్క హానికర పర్యవసానాలు ఇంకా చాలా వున్నాయి. నియోలిబరల్ విధానాల అమలు ఫలితంగా పెరిగే సాంఘిక అసమానతల ఫలితంగా చట్టపరమైన సమానత్వాన్ని సాధించేందుకు జరిగే ప్రయత్నాలన్నీ బలహీనపడతాయి. చట్టపరమైన సమానత్వం లేకపోతే ప్రజాస్వామ్యం విశ్వసనీయతను కోల్పోతుంది. పెద్ద పెద్ద కార్పొరేషన్లవద్ద అపారమైన నిధులు వుంటాయి. దానితో మీడియాను పెద్ద ఎత్తున ప్రభావితం చేయగలుగుతాయి. ఫలితంగా (ఎన్నికల వంటి) రాజకీయ క్రమాన్నే ముంచెత్తగలుగుతాయి. అమెరికాలోని ప్రజలలో 1/4 శాతంగా వుండే అత్యంత ధనికుల నుంచి, మొత్తం రాజకీయ విరాళాలలో 80 శాతం అందుతాయి. కార్పొరేషన్లు కార్మికులతో పోల్చితే 10 రెట్లు ఖర్చు చేస్తాయి. నియోలిబరల్ విధానంలో ఇదంతా సహేతుకమైనదిగానే పరిగణింప బడుతుంది. అక్కడ ఎన్నికలు కూడా మార్కెట్ నియమాలకు

లోబడే వుంటాయి. రాజకీయ పార్టీల కిచ్చే విరాళాలు పెట్టుబడి పెట్టడంతో సమానం. కనుక అత్యధిక ప్రజానీకం ఎన్నికలలో పాల్గొనడం అనేది అప్రధానం అయిపోతుంది. ఎక్కువ పెట్టుబడి పెట్టగల గుత్త సంస్థలదే తిరుగులేని అధికారంగా చలామణి అవుతుంది.

ప్రజాస్వామ్యం నిజంగా అర్థవంతంగా వుండాలంటే ప్రజలకు తోటి పౌరులతో సంబంధాలు సజీవంగా వుండాలి. వివిధ సంస్థల, సంఘాల రూపాల్లో ఈ సంబంధాలు వ్యక్తం కావాలి. సజీవమైన, శక్తివంతమైన రాజకీయ సంస్కృతి వుండాలంటే సామాజిక గ్రూపులు, గ్రంథాలయాలు, పబ్లిక్ విద్యాలయాలు, పౌర సంఘాలు, సహకార సంఘాలు, బహిరంగ సభావేదికలు, స్వచ్ఛంద సంఘాలు, కార్మిక సంఘాలు వంటివి అవసరం. పౌరులు కలుసుకోడానికి, అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకోడానికి, విషయాలను తెలియజెప్పడానికి ఇవి అవసరం. సమాజాన్నే ఒక మార్కెట్‌గా పరిగణించే నియోలిబరలిజం యీ రంగాలపై తనదాడిని ఎక్కుపెడుతుంది. పౌరుల స్థానే అది వినియోగదారులను ఉత్పత్తి చేస్తుంది. సామాజిక గ్రూపులస్థానే కొనుగోలుదార్ల సంతల్ని తయారుచేస్తుంది. దీని అంతిమ ఫలితం ఏమంటే ఎవరికి వారుగా విడిపోయిన పరస్పర సంబంధాలు తెగిపోయిన వ్యక్తులుగా మిగిలిపోతారు. సాంఘికంగా శక్తిహీనులుగా, ఏమీ చేయలేని వాళ్ళం అయిపోయాయని అనుకుంటూ నైతిన స్థైర్యాన్ని కోల్పోయిన వాళ్ళుగా మిగిలిపోతారు. అందుచేత ప్రజానీకం నిజంగా పాల్గొనే ప్రజాస్వామ్య విధానానికి తక్షణ, ప్రమాదకర శత్రువు యీ నియోలిబరలిజం ప్రపంచ వ్యాప్తంగా సమీపకాలం అంతటా దీనినే మనం ఎదుర్కోవాలి.

ప్రజాస్వామ్యం దాని సంపూర్ణమైన అర్థంలో మనగలగాలంటే అది పెట్టుబడిదారీ విధానంలో అసాధ్యం. అతి గొప్పపెట్టుబడిదారీ వ్యవస్థ కూడా ప్రజానీకానికి పూర్తి సమాచారాన్ని అందిస్తుందని గాని, విధానాల రూపకల్పనలో వారికి అవకాశం ఇస్తుందనిగాని భ్రమపడజాలం. పెట్టుబడిదారీ విధానమే కాదు. వర్గాలుగా చీలిన ఏ సమాజంలోనూ, ప్రజాస్వామ్యం మనలేదు.

ఆర్థిక వ్యవస్థలో పోటీ, సహేతుకత, సామర్థ్యం, న్యాయం వుండాలంటే స్వేచ్ఛా మార్కెట్‌లోనే అది సాధ్యమనే వాదనను నియోలిబరల్ వాదులొక మంత్రంలా జపిస్తున్నారు. అది వొట్టి బూటకం. 'స్వేచ్ఛా మార్కెట్' ఎప్పుడూ పోటీకీ, స్వేచ్ఛకు అవకాశం ఇవ్వదు. పెద్ద పెద్ద బహుళజాతి సంస్థల చేతుల్లో మార్కెట్లు చిక్కుకుని వుంటాయి. పాఠ్యపుస్తకాల్లో, ఉపన్యాసాల్లో కనపడే పోటీ వాస్తవంలో వుండదు. ఈ బహుళజాతి సంస్థలన్నీ నియంతృత్వ స్వభావంగలిగినవి. అప్రజాస్వామికంగా అవి నిర్వహించబడుతుంటాయి. వాటి చుట్టూ నిర్మించబడే సమాజంలో ప్రజాస్వామ్యం మనగలగడం అసంభవం.

ప్రభుత్వాలన్నీ అసమర్థతకు మారుపేరని, కనుక వాటి పాత్రను పరిమితం చేయాలని, లేకపోతే మార్కెట్ యొక్క సహజసిద్ధమైన 'స్వేచ్ఛాపోటీ' అనేది దెబ్బతింటుందని నియోలిబరలిజం వాదిస్తుంది. కాని వాస్తవం ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఆధునిక పెట్టుబడిదారీ విధానం, ప్రభుత్వాల ఆధారంగానే మనగలుగుతోంది. ఈ ప్రభుత్వాలు బహుళజాతి కార్పొరేషన్లకు భారీగా సబ్సిడీలు ఇస్తాయి. రాయితీలు ఇస్తాయి. వివిధ రంగాల్లో పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించడం కోసం అవసరమైన చర్యలన్నీ తీసుకుంటాయి. నియోలిబరల్ సిద్ధాంతాన్ని వల్లించే బహుళజాతి సంస్థలు తమదాకా వచ్చేసరికి పల్లవి మార్చేస్తాయి. ప్రభుత్వాలు తమకు పన్నురాయితీలివ్వాలని, పెట్టుబడులు సమకూర్చాలని, పోటీ నుంచి తమ మార్కెట్లను కాపాడాలని అవి కోరుతాయి. అదే సమయంలో తక్కినవర్గాల ప్రయోజనాలను - ముఖ్యంగా పేద, కార్మిక వర్గాల ప్రయోజనాలను, కాపాడే దిశగా ప్రభుత్వాలు గనుక చర్యలు తీసుకుంటే, స్వేచ్ఛామార్కెట్ విధానం నాశనం అయిపోతోందంటూ గగ్గోలు పెడతాయి. నియోలిబరలిజంలో ప్రభుత్వాల పాత్ర నిజానికి కుదించుకుపోదు. బహుళజాతి సంస్థల రక్షణదిశగా పెరుగుతుంది. సామాన్య, పేద పాత్ర నిజానికి కుదించుకుపోదు. బహుళజాతి సంస్థల రక్షణ దిశగా పెరుగుతుంది. సామాన్య, పేద, కార్మిక ప్రజల ప్రయోజనాలను రక్షిస్తామని చేసే నటన తగ్గిపోతుంది. అంతేతేడా.

ప్రభుత్వం యొక్క కీలకమైన, కేంద్రపాత్ర ప్రపంచ మార్కెట్ వ్యవస్థ ఆవిర్భావంలో ప్రస్ఫుటంగా వక్తమవుతోంది. దేశాల సరిహద్దుల్ని దాటి స్వేచ్ఛా మార్కెట్లు విస్తరించడం దాని సహజసిద్ధమైన లక్షణమే తప్ప వేరొకటి కాదని నియోలిబరల్ వాదులు వాదిస్తున్నారు. కాని ఇది వాస్తవానికి పూర్తిగా విరుద్ధం. శక్తివంతమైన ప్రభుత్వాల యొక్క ముఖ్యంగా అమెరికన్ ప్రభుత్వం యొక్క ప్రత్యక్ష జోక్యం వల్లనే ప్రపంచీకరణ జరుగుతోందని తిరుగులేని సత్యం. వాణిజ్య ఒప్పందాలను, ఇతర షరతులను, ఆంక్షలను బలవంతాన ప్రపంచ ప్రజలపై అమెరికా రుద్దుతోంది. దానివల్ల బహుళజాతి సంస్థలు ప్రపంచంలో వివిధ దేశాల మార్కెట్లలోకి చొరబడగలుగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థల్ని తమ పట్టు కిందికి తెచ్చుకోగలుగుతున్నాయి. ఆయా దేశాల ప్రజలకు సమాధానం చెప్పవలసిన అవసరం ఈ బహుళజాతి సంస్థలకెంత మాత్రమూ లేదు. ఈ క్రమం ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటు సందర్భంగానూ, మల్టిలేటరల్ అగ్రిమెంట్ ఆన్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఎమ్.ఎ.ఐ) పై రహస్యంగా జరుగుతున్న చర్చల సందర్భంగా స్పష్టంగా వ్యక్తం అయింది.

నియోలిబరలిజంపైన నిజాయితీగా, యదార్థ ప్రాతిపదికన చర్చలను, వాద ప్రతివాదనలను నిర్వహించలేక పోవడమనేది నియోలిబరలిజం యొక్క కొట్టొచ్చినట్టు కనపడే వొకలక్షణం. ప్రైవేటు న్యూస్ మీడియా, పౌర సంబంధాల పరిశ్రమ, విద్యారంగ సిద్ధాంతవేత్తలు, మేధో సంస్కృతి యొక్క ఆధిపత్యం యివన్నీ కలిసి మామూలుగా మింగుడుపడని స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థని ఒక సహేతుకమైన, దయార్ద్ర హృదయం కల్గిన, అత్యంత అవశ్యకమైన వ్యవస్థగా భ్రమింపజేయడానికి అవసరమైన పరిస్థితిని సృష్టిస్తాయి. ఇదంతా ఎవరో పనిగట్టుకొని చేసేదికాదు.

అలా చెయ్యనవసరంలేదు. అనేక సంస్థాగతయంత్రాంగాల ద్వారా మేధావులకు, పండితులకు, పత్రికా రచయితలకు స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థే అన్నింటికన్నా ఉత్తమమైనదిగా చిత్రీకరిస్తూ సంకేతాలు పంపబడతాయి. ఈ మార్కెట్ వ్యవస్థ వలన లాభపడే వారిని ఎదిరించి సవాలు చేయకుండా వుండేలా సూచనలు

అందుతాయి. కనుక ప్రజాతంత్ర ఉద్యమాల కార్యకర్తలు మీడియా రంగంలో ప్రైవేటు పెట్టుబడి ఆధిపత్యాన్ని వ్యతిరేకించేవారికి, నియోలిబరల్ పాలసీలను వ్యతిరేకించేవారికి, వాస్తవాలకోసం వెదికే వారికి ప్రవేశం లభించేలా పోరాడాల్సిన అవశ్యకత ఎంతైనా వుంది. ప్రజాస్వామ్యాన్ని వాంఛించే మేధావులు తమనితాము అద్దంలో పరిశీలించుకుని తాము ఎవరి ప్రయోజనాలకోసం పనిచేస్తున్నదీ, ఏ విలువలకోసం పాటపడుతున్నదీ ప్రశ్నించుకోవాలి.

నియోలిబరలిజం, కార్పొరేట్ సంస్థలు మన ఆర్థికవ్యవస్థ పైన, రాజకీయ వ్యవస్థపైన, పత్రికారంగంపైన, సాంస్కృతిక రంగం పైన శక్తివంతమైన, తిరుగులేని పట్టు కలిగివున్న విషయం పైన చదివివున్నారు. దానిని బట్టి చదువరులకు మనమింకేమీ చేయలేమన్న భారం, నీరసం, నిస్పృహ కలగరాదు. అటువంటి పరిస్థితులకు లోనై నైతిక స్థైర్యాన్ని కోల్పోయినవారు, మనం యిటువంటి తిరోగమన దశలో చిక్కుకు పోయామంటే దానికి కారణం మానవజాతికి సమానత్వం, మానవత, ప్రజాస్వామ్యం వున్న సామాజిక వ్యవస్థను రూపొందించడం చేతకాదనే పొరపాటు నిర్ధారణకు వస్తారు.

మనం ప్రపంచ ప్రజానీకంలో మౌలికంగా ప్రజాతంత్ర విలువల పట్ల వున్న మొగ్గు, మక్కువను విస్మరించరాదు. ఈ మొగ్గు వల్ల ప్రజాతంత్ర విలువల సాధనకోసం ఎన్నో విప్లవ పోరాటాలకు అవకాశం ఏర్పడుతుంది. అటువంటి అవకాశం వున్నదని కార్పొరేట్ సంస్థలు గమనించాయి. గనుకనే దానిని నిరోధించడానికి, నిజమైన ప్రజాతంత్ర రాజకీయ వ్యవస్థ ఏర్పడకుండా అడ్డుకోవడానికి తమ సర్వశక్తులనూ వొడ్డుతున్నాయి. తమ వ్యవస్థ కొద్ది మంది ప్రయోజనాలకోసం మాత్రమే ఏర్పడిందని వారు గ్రహించారు. కనుక మెజారిటీ ప్రజలు తమ ఆధిపత్యాన్ని ప్రశ్నించవీలులేకుండా చేయాలని వారు ప్రయత్నిస్తారు. అరకొర ప్రజాస్వామ్యం మాత్రమే వున్న దేశాలలో కూడా కార్పొరేట్ సంస్థలు ఎం.ఏ.ఐ. వంటి ముఖ్య విషయాలను బహిరంగంగా చర్చించనివ్వకుండా ఎంతో జాగ్రత్త పడతారు. ఎంతో హెచ్చు మొత్తాలను పౌర సంబంధాల వ్యవస్థ కోసం, ఇంతకన్నా మంచి వ్యవస్థ లేదని నమ్మించడం కోసం ఖర్చు పెడతారు. కార్పొరేట్ సంస్థలు ప్రచార సాధనాలద్వారా ఎంత హెచ్చుగా ఖర్చు పెడుతూవుంటే అంతగా ప్రజాస్వామ్య విలువల పట్ల, సమసమాజ వ్యవస్థ పట్ల సామాన్య ప్రజల్లో అంతర్లీనంగా మొగ్గు వున్నదని మనం అర్థం చేసుకోవాలి. ఏదో ఒక రోజున కార్పొరేట్ సంస్థలు తమకు ఇక మెజారిటీ ప్రజల నుంచి ప్రమాదం లేదని భావించి ధీమాగా ప్రచార వ్యవస్థపై పెట్టే ఖర్చును తగ్గించి, ప్రజాతంత్ర శక్తులు మీడియాలో చొరబడడానికి అవకాశం కల్పిస్తాయని, అంతవరకూ మనం ఎదురుచూడవలసిందేనని ఎవరైనా భావిస్తే అది పొరపాటు. అటువంటి రోజు ఏనాటికీ రానివ్వకుండా కార్పొరేట్ సంస్థలు నిత్యం ప్రయత్నిస్తూనేవుంటాయి. మనం ప్రత్యామ్నాయం కోసం పోరాడడం ద్వారానే ముందుకు పోగలుగుతాం తప్ప అనుకూలమైన దినం కోసం ఎదురు చూడడం ద్వారా కాదు.

నియోలిబరలిజం ప్రస్తుత వ్యవస్థకి ప్రత్యామ్నాయం ఏదీలేదని, నిజాయితి అభివృద్ధి క్రమంలో ఇదే అత్యున్నత దశ అని గట్టిగా నొక్కి చెపుతుంది. ఇలాగే ప్రచారం జరిగిన సందర్భాలు చరిత్రలో ఎన్నో వున్నాయి. 1920ల్లో ఒకసారి, 1950ల్లో ఇంకోసారి అమెరికన్ ప్రభుత్వాలు ఆనాటి వ్యవస్థల గురించి అలాగే ప్రచారం చేసుకున్నాయి. ఆ వ్యవస్థలపట్ల ప్రజలు అత్యంత సంతృప్తి చెంది వున్నారని చెప్పుకున్నాయి. ఆ వెనువెంటనే జరిగిన సంఘటనలు ఆ ప్రచారం అంతా ఒట్టిదేనని రుజువుచేశాయి. ఈ నియోలిబరలిజం సంగతి కూడా అంతే. ప్రజాతంత్ర శక్తులు ఒకటి, రెండు స్పష్టమైన విజయాలు సాధించగానే వారి నరాల్లోకి రక్తం చివ్వున చిమ్ముతుంది. మార్పు సాధ్యంకాదనే వాదనలకి గతంలోని వాదనలకు పట్టిన గతే పట్టి గాలికి కొట్టుకుపోతారు.

ఈనాటి వ్యవస్థకి ప్రత్యామ్నాయం లేదనే వాదనలు ఈనాటి శాస్త్ర సాంకేతిక అభివృద్ధి పూర్వరంగంలో అసలే పనికిరావు. మానవ జాతి స్థితిగతులను మెరుగుపరచడానికి తోడ్పడే సాంకేతిక పరిజ్ఞానం సంభ్రమాశ్చర్యాలు కలిగించేలా కనుగొనబడుతోంది. అయితే ఆ పరిజ్ఞానం యొక్క ప్రయోజనాలు జనసామాన్యానికి అందేలా, సమానత్వ ప్రాతిపదికన ప్రత్యామ్నాయ వ్యవస్థను నిర్మించడం ఎలా? అన్న ప్రశ్నకు, వెంటనే స్పష్టమైన సమాధానం లభించక పోవచ్చు. బానిస వ్యవస్థ మొదలు వలసవాదం వరకు అన్ని దోపిడీ వ్యవస్థలను కూలదోసే సందర్భంలోనూ ఇదే పరిస్థితి మొదట ఎదురైంది. తర్వాత క్రమంగా స్పష్టత ఏర్పడింది. ఆ వ్యవస్థలు కూలదోయబడ్డాయి. ఈసారీ అంతే. ఈనాడు కూడా సంఘటిత రాజకీయ ఉద్యమాలు, పోరాటాలు జరుగుతున్నాయి. కనుకనే ఒక మేరకైనా ప్రజాస్వామ్యం మనగలుగుతోందని మనం మరిచి పోకూడదు. సార్వత్రిక వయోజన ఓటుహక్కు మహిళ హక్కులకై పోరాటాలు, కార్మిక సంఘాల పోరాటాలు, పౌరహక్కులకై పోరాటాలు వంటివి ఆ కోవలోనివే. ఈ సంఘటిత రాజకీయ ఉద్యమాల కొనసాగింపు మనం నివసిస్తున్న ప్రపంచాన్ని మరింత మానవత్వ విలువలతో కూడినదానిగా మార్చుతుంది. ఆ క్రమంలోనే సహకారం, సమానత్వం, స్వపరిపాలన, స్వేచ్ఛ ప్రాతిపదికగా గల రాజకీయ ఆర్థిక వ్యవస్థను కూడా రూపొందించగలుగుతాం.

అటువంటి దశ ఏర్పడేలోపు సామాజిక మార్పుకై జరిగే పోరాటాన్ని కేవలం ఊహాజనితమైనదిగా, ఆచరించనవసరం లేనిదిగా భావించి వదిలివేయరాదు. ప్రస్తుత నియోలిబరల్ విధానం తూర్పు ఆసియా నుంచి తూర్పు యూరపు వరకు, లాటిన్ అమెరికా లోను పెద్ద ఎత్తున రాజకీయ ఆర్థిక సంక్షోభాల్ని సృష్టించింది. యూరప్, జపాన్, ఉత్తర అమెరికాల్లోని అభివృద్ధి చెందిన దేశాలలో కూడా జీవన స్వభావం చాలా అస్థిరంగా తయారైంది. అక్కడి సమాజాలు క్రమంగా అల్లకల్లోలమవుతున్నాయి. రానున్న సంవత్సరాల్లో, దశాబ్దాల్లో బ్రహ్మాండమైన తిరుగుబాట్లు పైకి లేవనున్నాయి. ఈ తిరుగుబాట్లన్నీ ఆటోమేటిగ్గా సమాజాన్ని మార్చేస్తాయని భావించడం అత్యాశే అయినా, వాటిని ఆసరా చేసుకుని ప్రజాతంత్ర ఉద్యమాలు మరో అడుగు ముందుకు వేయగలవని భావించవచ్చు. రానున్న రోజుల్లో ఉత్పన్నం అయ్యే పరిణామాలకు మనం అంటే ప్రజానీకం - ఎలా స్పందిస్తామో, ఎలా సంఘటితంగా వ్యవహరిస్తామో అన్నదానిపై ఫలితాలు ఆధార పడి వుంటాయి. మనం గనుక పరిస్థితిని మార్చలేం అనుకుంటే అది మారదు. మనం మార్చడానికి పూనుకొటే దానికి అవకాశాలు వున్నాయి. ఏం చెయ్యాలో ఎంచుకోవాల్సింది మనమే. ❒

ముసాయిదా బడ్జెట్ మూసిపెట్టిన నిజాలు

-అపర్ణ

అనూహ్యమైన రీతిలో 1995 సెప్టెంబరు 1వ తేదీన ముఖ్యమంత్రిగా రాష్ట్ర పగ్గాలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు తనదైన శైలిలో రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టేందుకు అనేక పథకాలు చేపట్టడం అవి ఒకదాని తరువాత ఒకటి బెడిసికొట్టటం జరుగుతోంది. ప్రజల వద్దకు పాలన, శ్రమదానం అనే పేరుకు పథకాలు తొలుత చేపట్టి ఈ రెండింటిని మిళితం చేసి "జన్మ భూమి" అనే పథకాన్ని రూపకల్పన చేసి ఇప్పటికి 18విడుత అమలు చేయటం జరిగింది. లక్షల్లో కారు లెక్కలు తప్ప, ప్రజల జీవితాల్లో ఫలానా మార్పు వచ్చిందని నిర్దిష్టంగా చెప్పడానికేమీ లేదు. ఇక తనదైన సహజ శైలిలో "విజన్ 2020" అనే భావకార్యా చరణ ప్రణాళికకు రూపకల్పన చేసి 26 జనవరి 1999న ముసాయిదా రూపంల విడుదల చేసి, ప్రజలు, మేధావుల నుంచి సలహాలు, అభిప్రాయాలు సేకరించిన తరువాత ఈ విజన్ 2020 ప్రణాళికకు తుదిరూపం ఇస్తామని చెప్పినా ఆ తుది రూపం ఏమిటో ఇంతవరకూ విడుదల కాలేదు. మరి సేకరించిన సలహాలు బుట్ట దాఖలు అయినట్లేనా? ఇంకొకటి అటు కేంద్రప్రభుత్వం ఇటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు "మానవాభివృద్ధి నివేదికలు" తయారు చేసి విడుదల చేయగా మనరాష్ట్రంలో ఇంతవరకు ఈ నివేదిక తయారు చేయలేదంటే 18 జన్మభూమి కార్యక్రమాలు ఎటువంటి మానవాభివృద్ధిని సాధించలేక పోయి వుండాలి. ముసాయిదా బడ్జెట్ గురించి చర్చించేముందు ఒక ముఖ్య విషయాన్ని ప్రస్తావించాలి. ఇప్పటికే మొత్తం బడ్జెట్‌లో ప్రతీ ఆరు రూపాయల్లో ఒక రూపాయి శాసన సభ్యుల వోటింగ్‌తో ప్రమేయం లేకుండానే కేటాయింపు ఖర్చు జరిగి పోతోంది. రాజ్యాంగం ప్రకారం గవర్నరు జీతం లాంటి వాటిపై శాసనసభయే వోటు చేసే అధికారం లేదు. ఉదాహరణకు 2001-02 లో రూ. 3605 కోట్ల ఖర్చులో రు.624కోట్ల మీద శాసన సభ్యులు వోటు చేయకుండానే వోటు చేసినట్లు భావించబడింది. ఇపుడు మరికొన్ని మొత్తాలు వోటింగ్‌కు రాకుండా వుండే ప్రక్రియను ప్రస్తుత ముఖ్యమంత్రి చేపట్టారు. ఏయే కార్యక్రమాలనైతే ప్రయివేటీకరిస్తున్నారో, అవన్నీ బడ్జెట్‌కు బయటనే వుండి పోతున్నాయి. గ్రామాలస్థాయిలో ఏర్పాటు చేసిన అనేక కమిటీలకు వసూలయ్యే మొత్తాలను వాం ఖర్చు చేసుకోవచ్చునన్నారు. అంటే ఈ ఖర్చులను వోటు చేసే అధికారాన్ని శాసనసభ్యులు కోల్పో తున్నారు. సభ్యులు నోరు నొప్పిపుట్టే దాకా ఆ విషయాల గురించి అరవవచ్చు, కాని కరవ లేరు. ఎందుచేతనంటే, అవి బడ్జెట్ పరిధికి అవతల విషయాలు. బ్యూరోక్రట్లే ఆ వ్యవహారాలు చూసుకొంటారు. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందో, బలపరుస్తుందో మీరే ఆలోచించండి.

పారదర్శకత మంత్రాన్నే ఉచ్చరించే తెలుగు దేశాధినేత అక్షర క్రమంలో అగ్రగామిగా వున్న మనరాష్ట్రానికి సంబంధించి శాసనసభా సమావేశాలకు ముందుగా గతసంవత్సరమే ఒక ముసాయిదా బడ్జెట్‌ను విడుదల చేయటం జరిగింది. ఇటువంటి ప్రయోగం చేయటం దేశంలోని తొలిసారి అన్నారు. ద్వితీయ విఘ్నం కలుగకుండా ఈ సంవత్సరం కూడా 22 జనవరి 2003న ముసాయిదా బడ్జెట్‌ను విడుదల చేసి, మన ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ వెళ్ళిపోయారు. కాదు వెళ్ళి వచ్చారు. పత్రికల్లో వచ్చిన విమర్శలకు జవాబున అన్నట్లుగా వచ్చేసంవత్సరం నుంచి ఇంకా ముందుగానే డిసెంబరులోనే విడుదల చేస్తామని ఒకసారి, తర్వాత లేదు, నవంబరులోనే అంటూ మరోసారి మన మంత్రి ప్రకటనలు చేసారు. ఏది నిజమో తెలియదు.

ఈ ముసాయిదా బడ్జెట్ మీద పత్రికల్లో పలురకాల విశ్లేషణాత్మక వ్యాసాలు కూడవచ్చాయి.

స్థూలరాష్ట్రాదాయం అసలు రాష్ట్రానికి లభించే ఆదాయ గణాంకాలు మూడు రంగాలనుంచి సేకరిస్తారు. అవి ప్రాథమిక, ద్వితీయ, సర్వీసుల టర్షియ రంగాలు. వీటి గణాంకాల వివరాలు గత సంవత్సరం ఇచ్చారుగాని ఈసారి ముసాయిదా బడ్జెట్‌లో పొందుపరచలేదు. వివరణలూ వెల్లడించలేదు. ఇటీవల లోక్‌సత్తా కన్వీనర్ జయప్రకాష్ నారాయణ "ప్రతిధ్వని" కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖామాత్యులను ఈ విషయం గురించి ప్రశ్నించగా శాసనసభ సమావేశాలకు వారం రోజుల ముందుగానే రాష్ట్ర ఆర్థిక సర్వేను విడదల చేస్తామని చెప్పారు. ప్రపంచబ్యాంకు అనుమతి లభిస్తుందనే ఆశిద్దాం. ఎందుచేతనంటే జూబ్లీహిల్స్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సంస్థలో పర్యవేక్షించి వున్న ప్రపంచ బ్యాంకు బృందానికి ప్రతీపత్రం, దేవుడి ముందు నైవేద్యం పెట్టినట్లు, వారికి నైవేద్యం పెట్టి, దీవెనలందుకొన్న తర్వాతనే మనకు ప్రసాదం లభ్యమవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో నిలకడ ధరల్లో స్థూలరాష్ట్రఆదాయం

95-96 నుండి 2000-01 వరకు మొత్తంమీద 5.58 శాతం కాంపౌండు అభివృద్ధిరేటు నమోదయింది. ఇదే కాలంలో ప్రాథమిక రంగాలలో అభివృద్ధిరేటు 3.20 శాతం వుండగా ద్వితీయ రంగంలో 6 శాతం, సర్వీసుల రంగంలో 7.20 శాతం నమోదయింది. ఈ నిలకడ ధరల ప్రకారం స్థూల రాష్ట్ర ఆదాయం కర్ణాటకలో 8.81 శాతం కాంపౌండ్ అభివృద్ధిరేటు సాధించగా బీహారు 7.73 శాతం, పశ్చిమ బెంగాల్ 7.04 శాతం, తమిళనాడు 6.03 శాతం, హర్యానా 5.84 శాతం అభివృద్ధిరేటు సాధించాయి. అనగా మన రాష్ట్రం ఈ దశలో 6వ స్థానంలో వుండడమే కాకుండా అభివృద్ధి రేటులో దేశం సాధించిన అభివృద్ధిరేటు 5.84 శాతం కన్న వెనుకబడివుంది.

ఆదాయం :

ఇక ఈ ముసాయిదా బడ్జెట్‌ను కూలంకషంగా పరిశీలిస్తే రాష్ట్ర స్వంత రెవెన్యూ రాబడులు 1995-96 లో రు. 5048 కోట్లు వుండగా 2003-04 సంవత్సరంలో రు. 18169 కోట్లకు పెరుగుతుందని అంచనా. అనగా ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో 15.4 శాతం కాంపౌండు అభివృద్ధిరేటు నమోదయింది. భారత కంట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదిక 2000 మార్చి 31తో ముగిసిన సంవత్సరంలో పోలిస్తే 1995-96న రాష్ట్ర సొంత రెవెన్యూ రాబడి రు. 5726 కోట్లు వుండగా ముసాయిదా బడ్జెట్‌లో రు. 5048 కోట్లుగా చూపించటం జరిగింది. ఇట్లా ఎన్నో గణాంకాలు పొంతన లేకుండా వున్నాయి. ఈ లెక్కల్లో లైస్, డామ్న్‌లైస్ స్టాటిస్టిక్స్ అనే నానుడిని సార్థకం చేసినట్లుంది. రాష్ట్ర స్వంత పన్నులలో అమ్మకపు పన్ను 1995-96లో 77.7 శాతం వాటా వుండగా 2003-04 సంవత్సరాలలో ముసాయిదా బడ్జెట్ ప్రకారం 66.8 శాతం వాటాకు తగ్గిపోతుంది. మోటారు వాహనం పన్ను రాబడి 1995-96లో రాష్ట్ర స్వంత పన్నులలో వాటా 11.2 శాతం వుండగా 2003-04 సంవత్సరంలో 7.5 శాతం వాటాకు దిగజారిపోతోంది. ఎన్.టి.ఆర్ ప్రజల సౌలభ్యం కోసం మద్యపాన నిషేధాన్ని రాష్ట్రంలో అమలు పరిచినప్పుడు రాష్ట్ర ఎక్సైజ్ రాబడి 1995-96 లో రు. 77.66 కోట్లకు పడిపోయింది. దీని వాటా రాష్ట్ర స్వంత పన్నుల్లో 1.9 శాతమే. కాగా నదులకు వరదలు వచ్చినపుడు ఫ్లడ్ గేట్స్ తెరిచినట్లు చంద్రబాబు మద్యపాన నిషేధాన్ని ఎత్తివేయటమే కాకుండా బార్లను బార్లా తెరిపించడంవల్ల రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం 2003-04 సంవత్సరంలో రు. 2188 కోట్లకు రాష్ట్ర స్వంత పన్నుల రాబడిలో 15 శాతం వాటాగా నమోదయింది. అయినా ఎన్ని ఎక్సైజ్ దాడులు నిర్వహించినా కూడా నాటు/దొంగ సారా విక్రయాలు జరుగుతూనే వున్నాయి. ఇక రాష్ట్ర స్వంత పన్నేతర రాబడి 1995-96లో 28 శాతం వాటాగా ఉన్న ఈఆదాయం 2003-04లో 19.6 శాతానికి రు. 1606 కోట్లు వుండగా 2003-04 సంవత్సరంలో 12.6 శాతానికి దిగజారిపోతోంది. దీన్ని బట్టి రాష్ట్రంలో పన్నులు మరియు పన్నేతర రాబడులలో వసూళ్ళు సరిగా లేవన్నమాట. కేంద్రం నుంచి రాష్ట్రానికి లభించే పన్నుల రాబడి 1995-96 లో రు. 2563 కోట్లు. ఇది మొత్తం పన్నుల రాబడిలో 38.3 శాతం ఉండగా 2003-04లో ఈ పన్నుల ద్వారా రాబడి రు. 5273 కోట్లకు పెరిగినా మొత్తం రాష్ట్ర పన్నుల రాబడిలో 26.5 శాతానికి తగ్గింది. కేంద్రంలోని బిజెపి సర్కారుకు ప్రాణవాయువులా మద్దతు ఇస్తున్నా రాష్ట్రానికి కేంద్రంపన్నులలో వాటా తగ్గిపోతున్నట్లేకదా! కేంద్రం నుంచి లభించే గ్రాంట్లు మొత్తం రాష్ట్రం రెవెన్యూ రాబడుల్లో 1995-96 సంవత్సరంలో మరియు 2003-04 సంవత్సరములో ఎదుగుబొదుగు లేకుండా 16 శాతం దగ్గరే స్థంభించింది.

వ్యయం :

ఇక వ్యయ గణాకాలు చూస్తే 1995-96లో రెవెన్యూ పద్దు కింద ప్రణాళికా వ్యయం రు. 1420 కోట్లు వుండగా 2003-04 సంవత్సరంలో రు. 7162 కోట్ల రూపాయలు పెరుగుతుందని అంచనా. అనగా 1995-96లో మొత్తం రెవెన్యూ వ్యయంలో ప్రణాళికా వ్యయం 13.4 శాతం వుండగా 2003-04 సంవత్సరంలో 23.6 శాతానికి పెరుగుతోంది. ప్రణాళికేతర వ్యయం 1995-96లో మొత్తం రెవెన్యూ వ్యయంలో 87 శాతం ఉండగా 2003-04లో 76.4 శాతానికి తగ్గిపోతోంది. ఇది గుడ్డిలో మెల్ల సామెత లాగా వుంది. కాని ఏ ఖర్చు అయితే ఆస్తులను పెంచుతుందో ఆ మూలధన వ్యయం మొత్తం రాష్ట్ర వ్యయంలో 1995-96 లో 14.4 శాతం వుండగా 2003-04 లో 10.1 శాతం వాటాకు పడిపోతున్నట్లు గోచరిస్తోంది. ఇక అప్పులమాట వస్తే ఇంతింతై వటుడింతై అన్నట్లు రాష్ట్రంలో ప్రజారుణం 1995-96 లో ఈ ముసాయిదా బడ్జెట్ ప్రకారం రు. 15137 కోట్లు వుండగా 2003-04 సంవత్సరంలో రు. 57150 కోట్లకు పెరుగుతాయని అంచనా. వాటికి 2003-04 సంవత్సర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు (రు. 1570 కోట్లు) కలిపితే ప్రజారుణం రు. 72859 కోట్లవుతుంది. అంటే తలసరి రుణం రు. 9714 అవుతుంది. తలసరి రాబడి రు. 5611 మాత్రమే. అనగా రాష్ట్రం పూర్తిగా అప్పులు కొలిమిలో వున్నట్లే కదా!

ఆర్థిక లోటు :

రెవెన్యూ ఖర్చులకు, రెవెన్యూ వసూళ్ళకు మధ్య అంతరమే రెవెన్యూలోటు. ఈ లోటు 1995-96లో రు. 767 కోట్లు వుండగా 2003-04 సంవత్సరంలో రు. 2408 కోట్లు వుంటుందని అంచనా. ఈ లోటు స్థూలరాష్ట్ర ఆదాయంలో 1995-96 లో 0.96 శాతం ఉండగా 2003-04లో 1.32 శాతానికి పెరుగుతుందని అంచనా. పెట్టుబడి మరియు రెవిన్యూ ఖర్చులకు (ఇచ్చిన నికర రుణాలతో కలిపి) రెవిన్యూ వసూళ్ళకు (సహాయం, గ్రాంట్లు కొన్ని రకాల రుణేతర పెట్టుబడి వసూళ్ళలో కలిపి) మధ్య అంతరమే ద్రవ్య లోటు. ఈ ద్రవ్యలోటు 1995-96లో రు. 2445 కోట్లు వుండగా 2003-04 సంవత్సరము ముసాయిదా బడ్జెట్ అంచనాల ప్రకారం రు. 7528 కోట్లకు పెరగబోతోంది. ఈ ద్రవ్యలోటు స్థూల రాష్ట్ర ఆదాయంలో 1995-96లో 3.06 శాతం వుండగా 2003-04 లో 4.13 శాతం వుంటోంది. ద్రవ్యలోటు తగ్గించాలి. తగ్గించండి అంటూ ప్రపంచబ్యాంకు కేంద్రాన్ని, రాష్ట్రాలను వెంటాడుతోంది. ఇదేదో

సామాన్యులకు సంబంధించని విషయమని అనుకోవడానికి వీలులేదు. ద్రవ్యలోటు తగ్గాలంటే ఖర్చును అదుపులో పెట్టు కోవాలి. ఆదాయాన్ని పెంచుకోవాలి. మొదటిది సాధించాలంటే సబ్సిడీలు తెగ్గొయ్యాలి. రెండోది చెయ్యాలంటే ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి ఆ డబ్బును బడ్జెట్‌లో కలిపేసుకోవాలి. ఇవి ప్రపంచబ్యాంకుకు చాలా చాలా ఇష్టమైన పరిష్కారాలు. ఇలా చేస్తే సబ్సిడీలు పుచ్చుకునే అలగా జనం, అటు ప్రభుత్వ రంగం పీడా వదిలిపోతుందని బాంకు పథకం. దానికి తందానా అని అనడమే కాకుండా అలా చేసి చూపిస్తున్నారు మన ముఖ్యమంత్రి.

ఈ ముసాయిదా బడ్జెట్ విడుదల తరువాత వివిధ శాఖల వారీగా సుమారుగా ఓ ఇరవై ఆచరణా బడ్జెట్లు విడుదల చేశారు. ద్వితీయ మరియు సర్వీసుల రంగాలకు సంబంధించి ముసాయిదా బడ్జెట్‌లో పరిశ్రమలు, వ్యాపార శాఖ, కార్మిక ఉపాధి శాఖలు, శిక్షణ శాఖ, పర్యాటక శాఖ, పర్యావరణం, అడవులు, సైన్స్, టెక్నాలజీ శాఖ, ఐ.టి. కమ్యూనికేషన్స్ శాఖ దేవదాయ శాఖలు మిళితమై ఉన్నాయి. దేవుడికి చేసే సేవలు కూడా సేవారంగంలోకి వచ్చే సాయన్నమాట. భారీ పరిశ్రమల కోసం 2003-04 సంవత్సరంలో సాలుకి రు. 2800 కోట్లు మేరకు పెట్టుబడులు వస్తాయని అంచనా. పరిశ్రమల ప్రోత్సాహానికి ఈ ముసాయిదా బడ్జెట్‌లో రు. 70 కోట్లు కేటాయించారు. ఉదాహరణకు ఈ ఒక్క పద్దును కాస్త వివరంగా పరిశీలించవచ్చు.

లక్షలొస్తాయి, కోట్లొస్తాయని విని విని, ఎదురు చూచి చూచి విసుగెత్తి పోవటమేకాక, విశ్వసనీయతకూడా సన్నగిల్లిపోయింది. అధికారంలోకి రావడంతోనే లక్ష కోట్లొస్తాయన్నారు. ప్రతి సంవత్సరం ఇన్ని లక్షల రూపాయల పెట్టుబడికి ప్రతిపాదనలు మంజూరు అయ్యాయంటూ అరారా వార్తలు పత్రికలకు ఇస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం పారిశ్రామిక శిఖరాగ్ర సదస్సు సమయంలో రు. 36 వేల కోట్లు ప్రతిపాదనలమీద సంతకాలు జరిగాయి. పరిశ్రమలొచ్చేస్తున్నాయన్నారు. తాజా సదస్సులో రు. 17 వేల కోట్లు వస్తాయంటున్నారు. కాని వచ్చినవి కొద్ది వేల కోట్లు మాత్రమే. అవి కూడా నడుస్తున్న పరిశ్రమల్లో వారి ఈక్విటీ పెంచుకోవడానికే కాని కొత్త పరిశ్రమలు స్థాపించడానిక్కాదు. కొత్త పరిశ్రమలొస్తాయో లేదోకాని ఉన్న పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఏ భారీ కేంద్ర పరిశ్రమలు ప్రభుత్వరంగంలో స్థాపించబడి రాష్ట్ర పారిశ్రామికీ కరణకు పునాదులు వేసాయో, వాటిని పునాదుల్లో నుంచి లేపేసి, ఎవరెవరికో ధారాదత్తం చేసేశారు. చేసేస్తున్నారు. డర్టీ జాబ్ చేయడానికి ఒక ప్రత్యేక శాఖను కూడా ఏర్పాటు చేశారు. భారీ పరిశ్రమలకే దిక్కు లేకుండా పోతుంటే చిన్న పరిశ్రమలు మూసేస్తే ఎంత, తెరిస్తే ఎంత అనే విధంగా ప్రభుత్వం ప్రవర్తిస్తుంది. ఆ మధ్య 'బిజినెస్ లైన్' పత్రికలో వచ్చిన గణాంక వివరాల ప్రకారం మార్చి 2001 నాటికి రాష్ట్రాల వారిగా కాయిలాపడిన చిన్న పరిశ్రమలు కర్నాటకలో 4400, ఒరిస్సాలో 5668, మధ్యప్రదేశ్‌లో 6614, మహారాష్ట్రలో 8056, తమిళనాడులో 2252 కాగా మన రాష్ట్రంలో వాటి సంఖ్య 11841 సహజంగానే వేలమంది నిరుద్యోగులై వీధిన పడుతున్నారు. లేదా లాలించి, బెదిరించి వి.ఆర్.ఎస్. తీసుకొని బయటకు వెళ్ళిపోయేలా చేస్తున్నారు. కాగా పరిశ్రమలకు కేటాయింపులు చేయటం అంటే లేదా పెంచడం అంటే ప్రయివేటు రంగానికి సౌకర్యాలు కలుగజేయడాని కేనని స్పష్టం. తాజాగా సింగరేణి, ఆర్టీసి ప్రయివేటీకరణకు క్యూలో నిల్చున్నాయి. ఈ క్యూ ప్రస్తుతానికి కొంచెం పొడుగ్గానే వుంది. కాని వాటివంతూ రాబోతోంది.

పట్టిక

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆమోదాలు
(ఆగష్టు 1991 నుండి జులై 2002 వరకు)
(రూ. మిలియన్లు)

రాష్ట్రం	విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆమోదాలు
ఆంధ్రప్రదేశ్	130939
బీహారు	7397
ఢిల్లీ	338472
గుజరాత్	184538
హర్యానా	35194
హిమాచల్ ప్రదేశ్	11739
కర్నాటక	219847
కేరళ	15281
మధ్యప్రదేశ్	92347
మహారాష్ట్ర	488952
ఒరిస్సా	82292
పంజాబు	19684
రాజస్థాన్	30052
తమిళనాడు	234758
ఉత్తర ప్రదేశ్	47950
పశ్చిమ బెంగాల్	88515

ఆధారం : SIA New letter, August 2002, Ministry of Commerce & Industry

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల గణాంకాలు చూస్తే రాష్ట్రాల వారీగా (ఆమోదాన్ని పరిశ్రమ వచ్చేసినట్లుగా ముఖ్యమంత్రి ప్రచారం చేసుకొంటున్నారు) ఆమోదాలు ఆగస్టు 1991 నుండి జులై 2002 వరకు మహారాష్ట్ర రు. 48895 కోట్లతో ప్రథమ స్థానంలో వుండగా ఢిల్లీ రెండవ స్థానంలో, తమిళనాడు 3వ స్థానం, కర్ణాటక 4వ స్థానం, గుజరాత్ 5వ స్థానంలో వున్నాయి. ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో వుంది. కాబట్టి గాలిలో మేడలు కట్టకుండా రాష్ట్రంలో వున్న వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి బేరీజు వేసుకొని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, మరియు అవినీతిని, రెడ్ టేపిజంను నక్సలిజంను అరికట్టేందుకు సత్వర చర్యలు తీసుకొంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చేందుకు అవకాశాలు మిన్నగా ఉంటాయి. లేదంటే కాగితాలకే ఎం.ఓ.యు. లు పరిమితమయి వుంటాయి. ఎన్ని భాగస్వామ్య సదస్సులు నిర్వహించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంటుంది. ❑

ధరలెందుకు పెరుగుతున్నాయి

-కె. రామ చంద్రారెడ్డి

బస్సుఛార్జీలు గత సంవత్సరం, ఈ సంవత్సరం కూడా పెరిగాయి. చంద్రబాబు పాలనలో బస్సుఛార్జీలు పెరగటం ఇది తొమ్మిదో సారి పెరిగాయి. గతసంవత్సరం విద్యుత్ ఛార్జీల వడ్డన జరిగింది. ఈ సంవత్సరం వేచి చూడాలి. సబ్సిడీలు తగ్గించటం వల్ల ఎరువుల ధరలు పెరిగాయి. వంట నూనెల ధరలు పెరుగుతున్నాయి. గడచిన కొద్ది నెలల్లో పెట్రోలు, డీజిల్ ధరలు 11సార్లు పెరిగాయి. మందుల ధరలు చుక్కలంటుతున్నాయి. గడచిన సంవత్సరంలో పోస్టల్ ఛార్జీలు పెరిగాయి. ధరలు పెంచే క్యూలో గ్యాస్, కిరసనాయిల్ వున్నాయి. బియ్యం ధరలు పెరిగాయి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చే నాటికి కిలోబియ్యం రెండురూపాయలు, ఇపుడు ఎనిమిది రూపాయలు. ధరలు ఇలా ఎందుకు పెరుగు తున్నాయి? ఇరాక్‌పై యుద్ధ సన్నాహాలు, వర్షాభావ పరి స్థితులు కారణాలని ప్రభుత్వం అంటోంది. అవే కారణాలా?

ప్రాథమికంగా చూస్తే సామ్యవాద తరహా సమాజమే లక్ష్యమని రాజ్యాంగంలో రాసుకున్న ప్రభుత్వం కల్తీలేని పెట్టుబడి విధానాన్ని పెంచి పోషిస్తూండడమే మూలకారణం. పెట్టుబడులు పెట్టే వారికి లాభాలే లక్ష్యం. ధరలు పెంచితే లాభాలు బాగా వస్తాయి. ఈ వ్యవస్థ నడిచినంత కాలం ధరల పెరుగుదల అనివార్యం. ప్రభుత్వమే ధరలు పెంచడం రెండోకారణం. ఆహార ధాన్యాల ధరలను ప్రభుత్వమే నియంత్రిస్తుంది. ఆహార ధాన్యాల ధరలు పెరిగితే మిగతా వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. సామాన్య ప్రజల వినిమయ ఖర్చులో సగానికి పైగా తిండిగింజల కోసమే ఖర్చవుతుంది. ఆహారధాన్యాల ధరలను ధరల నియంత్రణ కమీషన్ ప్రతిసంవత్సరం సిఫార్సు చేస్తుంది. కాని ప్రతిసంవత్సరం ధనిక రైతుల, రాజకీయనాయకుల వ్యాపారస్థుల లాభాల ఒత్తిడికి తలవంచి సిఫార్సుచేసిన ధరకన్నా హెచ్చుగా కనీస ధరను ప్రకటిస్తుంది. అంటే రాజకీయ అవసరాలకోసం ధరలను ప్రభుత్వం పెంచుతుంది. ('రెండు రెండ్లు నాలుగు' లో వివరాలు చూడవచ్చు)

డబ్బు ఎక్కువగా చలామణిలో వుండి, ఉత్పత్తి తక్కువైతే కూడా ధరలు పెరుగుతాయి. ఇది మూడో కారణం, అయితే విచిత్ర మేమంటే కోట్ల టన్నుల ఆహార ధాన్యాల నిల్వలు మూలుగుతున్నా ధరలు పెరుగుతున్నాయి. రేషన్ షాపుల్లో బియ్యం వున్నాయి కాని విడుదలలేదు. ఆర్థిక శాస్త్ర సూత్రాలనే తిరగరాస్తుంది ఎన్.డి.ఎ. ప్రభుత్వం.

వ్యాపారస్తులు ధరలు పెంచటం నాలుగోకారణం. పంటలు పండక పోతే, వస్తువుల కొరత ఏర్పడితే, ఎక్కడో యుద్ధం జరిగితే, ఏ వస్తువులైనా పాప్యులర్ డిమాండ్‌వుంటే, ఇలా ఒక కారణమంటూ ఉండనక్కర్లేదు. అవకాశం దొరికినా, దొరక్కపోతే దొరకపుచ్చుకొని ధరలు పెంచేస్తారు. 1943లో బెంగాల్ కరువులో వందలమంది చనిపోయారంటే తిండిగింజలు లేకకాదు. వ్యాపారస్థులు నిల్వలను దాచివేయటం వల్లనే అనే విషయం మరువరాదు. ఆ మధ్య ఉల్లిపాయల ధరలు కళ్ళనీళ్ళు తెప్పించాయంటే అది వ్యాపారస్తుల ఘనతే. ప్రస్తుతం రాష్ట్రం కరువు పరిస్థితులనెదుర్కొంటుంది కాబట్టి బియ్యం ధరలు ఆకాశంవైపు చూస్తున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పాలడబ్బాలు చంటిపిల్లల కనీసవసరమైనవనే మానవతను మరచి, బ్లాక్ మార్కెట్‌లోకి తరలించి సొమ్ము చేసుకున్నారు. ఏ పరిణామంవల్ల గాని ధరలు పెరగనున్నాయని తెలిస్తే చాలు. వ్యాపారస్థులు అలెర్ట్ అయిపోతారు. యుద్ధం రాబోతుందని బంగారం ధరలు చుక్కలు చూస్తున్నాయి.

ప్రభుత్వం కంట్రోళ్ళ మూలంగానే ధరలు పెరిగాయి. ఈ నియంత్రణను ఉపసంహరిస్తే, వ్యాపారస్థులు, పారిశ్రామిక వేత్తలు పోటీపడి ధరలు తగ్గిస్తారు. అందుమూలంగా వినిమయదారులు లాభపడతారు అని అంటారు. సిమెంటుమీద నియంత్రణ తొలగించారు. ధర పెరిగిందా? తరిగిందా? పైగా కంపెనీలు కూడబలుక్కుని ధరలు పెంచేస్తున్నారు. ఉదాహరణకు నవంబర్‌లో రాష్ట్రంలో సిమెంటు కంపెనీలన్ని సిమెంటు ధరను పెంచాలని నిర్ణయించుకొని, రెండు రోజులపాటు సిమెంటుకు డిస్పాచ్ హాలిడే ఇచ్చారు. తర్వాత ధర పెంచారు. పోటీపడడం మాట అటుంచి అదే వస్తువు ఉత్పత్తి చేసే కంపెనీల్లో పెద్దవి చిన్నవాటిని మింగేసి గుత్తాధిపత్యం సంపాదించి ధరలు పెంచుతున్నారు. గత సంవత్సరం పెట్రోలు ధరల నియంత్రణ తొలగించిన తర్వాతనే ధరలు పెరిగాయి. పెరుగుతూనే వున్నాయి. ఇది అయిదో కారణం.

ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతోంది, ప్రోత్సహిస్తోంది. మంచిదే. అయితే ప్రాసెసింగ్ లోపలి సరుకు విలువ రూపాయి అయితే ప్యాకింగ్ ముస్తాబు చేసి పారిశ్రామిక వేత్తలే లాభపడుతున్నారు. ఇది ఆరవ కారణం.

విదేశీ వినిమయ విలాసవస్తువులను ఉన్నతాదాయ వర్గాల్లో గిరాకివుండడం కొత్తేమీకాదు. కానీ 1500 వస్తువుల దిగుమతుల మీద ఆంక్షలు తొలగించడంతో విదేశీ వస్తువులు వెల్లువగా వచ్చి పడుతున్నాయి. మధ్య తరగతి వర్గాన్ని విదేశాలనుంచి దిగుమతి అవుతున్న వినిమయ విలాస వస్తువులను కొనడానికి ఆకర్షించే విధంగా వడ్డీ రేట్లు కూడా తగ్గించింది. రైతులకు వడ్డీ రేట్లు తగ్గించ డానికి గింజుకొనే ప్రభుత్వం విదేశీ పారిశ్రామిక వేత్తల వ్యాపారం పెరగడానికోసం వడ్డీలు తగ్గించే ప్రభుత్వాన్నేమనాలి? ఇది కూడా ధరల పెరుగుదలను ప్రభవితం చేస్తుంది.

ద్రవ్యోల్బణం తగ్గుతోంది. ఇది ధరలు తగ్గాయనే అభిప్రాయం కొందరిలో కలిగిస్తుంది. ద్రవ్యోల్బణం తగ్గడమంటే, ధరల పెరుగుదలవేగం తగ్గడమేనని, ధరలు తగ్గుతున్నాయని కాదని తెలిసిన విషయమే. ద్రవ్యోల్బణానికి, సామాన్య మానవుడి జీవితానాకి సంబంధం లేదు. అతను చిల్లర ధరకు వస్తువులను కొనుక్కుంటాడు. కాని ద్రవ్యోల్బణం టోకు ధరల ఆధారంగా లెక్క కడతారు. టోకు ధరకు, చిల్లర ధరకు మధ్య వ్యత్యాసం రెండు శాతం నుంచి అయిదు శాతం వరకు వుంటుంది. టోకు ధరల సూచిని తయారు చేయడానికి 447 ఉత్పత్తుల ధరలను ప్రభుత్వ యంత్రాంగం దేశంలో నిర్ణీత కేంద్రాల్లో సేకరిస్తుంది. టోకు ధరలకు ఒక సూచిక తయారుచేయడానికి, గత సంవత్సరంలో అదే నెల, అదే వారంలో వున్న సూచితో పెరిగింది, తరిగిందీ పోల్చి ప్రకటిస్తారు. ఈ సూచిని తయారు చేయడానికి ఒక సంవత్సరాన్ని ప్రాతిపదికగా (బేస్ ఇయర్) తీసుకొని, ఆ సూచినూరుగా భావించి, అక్కడనుంచి పెరిగే తరిగే ధరల బట్టి పాయింట్లు కలపడమో, తీసివేయడమో జరుగుతోంది. 1960, 1982 ప్రస్తుతం 1994 ప్రాతిపదికలుగా నిర్ణయించి, ధరలసూచిని ప్రకటిస్తూ వచ్చింది. ఈ సూచిల ఆధారంగా ద్రవ్యోల్బణాన్ని నిర్ధారిస్తుంది. అయితే ప్రభుత్వం ధరల గురించి సేకరించిన గణాంకాలు వాస్తవంగా వున్న పెరుగుదలను చూపించవు. అసలు టోకు ధరల ఆధారంగా సూచిని నిర్ణయించ డమే తప్ప ఇతర దేశాల్లో వినిమయ ధరల సూచి ఆధారంగా ద్రవ్యోల్బణం పెరుగుదల రేటును నిర్ణయిస్తారు. ఈ సూచి గురించి మరో విషయం తెలుసుకోవాలి. ఈ సూచిని నిర్ణయించడానికి గణనలోకి తీసుకొన్న వస్తువులను (అంటే తిండిగింజలు, పప్పు దినుసులు, పాలు, పళ్ళు వగైరా) ఇన్ని పాయింట్లు (వెయిటేజ్) అని లెక్క వేస్తారు. కాని జీవన విధానంలో వస్తున్న మార్పువల్ల మనం తినే తిండిలో తిండి గింజలకన్నా పళ్లు, ఫలాలు ఇతర రకాల ఆహార పదార్థాలను తింటున్నామనుకోండి. అపుడు వాటి పాయింట్లు మారాలి. అలాగే ధరల పెరుగుదల వల్ల వ్యవసాయ కూలీలు ఇదివరకటి కన్నా ఎక్కువగా అన్నమే తింటూ, కూరనార తక్కువ తింటుంటే, పాయింట్లను వాటి కనుగుణంగా మార్చాలి. అయితే ఈ పాయింట్లు ఎపుడో నిర్ణయించారు. ఎక్కువ, తక్కువ ఆదాయాలవారు తినే వస్తువులలో తేడా వుంటుంది. కాని ఇపుడు ఇరువర్గాలకు ఒకటే సూచి తయారు చేస్తున్నారు. ఈ కారణాల వల్ల టోకు ధరలసూచి పెరిగిన ధరల వాస్తవ పరిస్థితిని ప్రతిబింబిం చదు. ఫలితంగా దాని ఆధారంగా నిర్ణయించే ద్రవ్యోల్బణం కూడా వాస్తవానికి దూరంగా వుంటుంది. వినిమయ దారుల సూచిని తెల్లచొక్కాలవారికి, వ్యవసాయ కూలీలకు, ఇతరు లకు వేరు వేరుగా రూపొందిస్తారు కాబట్టి ఇవి వాస్తవానికి కొంచెం దగ్గరగా వుంటాయి. ఈ సూచికగురించి తెలుసు కోవాల్సింది ఇంకా చాలా వుంది. కాని ఇక్కడ అప్రస్తుతం. చెప్పొచ్చేదే మంటే టోకుధరల ఆధారంగా నిర్మించిన ద్రవ్యోల్బణ శాతం పెరిగినా, తరిగినా సామాన్యులకు సంబంధించిన విషయం. ద్రవ్యోల్బణం తగ్గినా వినిమయదారుల ధరలు పెరిగిన సందర్భాలు అలాగే టోకుధరలు తగ్గినా, వినిమయ ధరలు పెరిగిన సందర్భాలూ వున్నాయి. పత్రికల్లో ప్రచురించిన వినిమయదారుల ధరల సూచికి మనం బజారుకు వెళ్లితే అక్కడ సరుకుల ధరలకు తేడా వుండడం మన నిత్యానుభవం. అదే నిజమైన ద్రవ్యోల్బణం. ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా వుందని అందరూ అంగీకరిస్తున్నారు. ధరల పెరుగుదల ఆ పరిస్థితి ఏర్పడడానికి మూలకారణాల్లో ఒకటి.

1. ధరలు పెరుగుతూంటే, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరిగిపోతూ ప్రణాళికలను, బడ్జెట్‌ను తలకిందులు చేస్తుంది. బడ్జెట్లలో చేసిన కేటాయింపులు సరిపోవు. అప్పు తెచ్చి నిర్మాణం పూర్తి చేయాలనే ఆలోచనే ప్రభుత్వానికి ఎందుకు రాలేదంటే తెస్తున్న ఖర్చు దిన ఖర్చులకే చాలటం లేదు.
2. ధరల పెరుగుదల అతని ఉద్యోగుల, ఇది సామాన్యుల బడ్జెట్లను అతాలాకుతం చేస్తుంది. వారిలో అశాంతిని రేపుతుంది. ఆ అశాంతి, ఆ అసంతృప్తి శాంతి భద్రతలకు దారి తీస్తుంది.
3. ధరలు పెరిగితే డి.ఎ. పెంచాల్సి వస్తుంది. బడ్జెట్‌లో కేటాయింపులు సరిపోవు. లోటు పెరుగుతుంది.
4. ధరలమీద అదుపువున్నపుడే ప్రణాళికల అమలు సాధ్యం. ప్రజల, ప్రభుత్వాల ప్రాధాన్యతల వైపు మొగ్గు చూపుతుంది.
5. పెరుగుతున్న ధరలు పెరిగిన మేరకు ఆదాయాలను పెంచకపోవటంతో అంతరం ఏర్పడి, ఆలోటు పూడ్చుకోవ డానికి అడ్డదారులు తొక్కటం ప్రారంభమవుతూంది. లంచగొండితనం సర్వాంతర్యామిగా తయారవుతుంది.
6. ధరల పెరుగుదల నిధుల కొరత దారితీసినపుడు రుణాలకు ఎగబడాలి. రుణాలు పెరుగుతాయి. వడ్డీలు ఇంకా పెరుగుతాయి. సంక్షేమ పథకాలమీద వేటు పడుతుంది.
7. ధరలు పెరిగితే జీవన వ్యయం పెరుగుతుంది. వచ్చే ఆదాయం అదే కావటంతో ఖర్చు తగ్గించుకొనే ప్రయత్నం లో తినే తిండి తగ్గుతుంది. అది వ్యక్తిగతంగా అరోగ్యానికి దారితీస్తుంది. పనిచేసే ఫ్యాక్టరీలో ఉత్పాదకత దెబ్బ తింటుంది.

ఇవి కొన్ని పరిణామాలు మాత్రమే. పాలకులు లక్షా తొంభై ప్రకటనలు చేస్తూంటారు కాని ధరలు తగ్గించడానికి చేపట్టిన చర్యల గురించి చెప్పరు. ప్రజలు పాలకులచేత చెప్పించాలి. చెప్పింది చేసేటట్లు చూడాలి. ❐

ఫైనాన్స్ కాపిటల్ అంటే...

- వి. హనుమంతరావు

సరళీకరణ తర్వాత దేశంలో మాటలో, రాతలో కొత్తకొత్త పదాలు వచ్చి చేరాయి. ఆదాయ వ్యయాలు అన్నీ డాలర్లలో చూపిస్తున్నారు. ఇటీవల సరికొత్తగా వాడుకలోకి ఫైనాన్స్ కాపిటల్, గ్లోబలైజేషన్ ఆఫ్ ఫైనాన్స్ కాపిటల్ అనే కొత్త పదాలు వచ్చాయి. గ్లోబలైజేషన్ ఆఫ్ ప్రొడక్షన్ అనే మాట కూడా పత్రికల్లో చదువు తున్నాం. సామాన్యులే కాదు, విద్యాధికులు కూడా అర్థం తెలియ కుండానే చదివేస్తున్నారేమో అనిపిస్తుంది. ఇటువంటివారికి (నాతో సహా) ఎంతైనా ఉపయోగపడే రెండు పుస్తకాలను ఢిల్లీలోని మధ్యమ్ బుక్స్ సంస్థ ప్రచురించింది. కవల్జిత్‌సింగ్ అనే ఆర్థిక విషయాల రచయిత ఈ మాటలనే కాదు, వాటి వెనుకనున్న కథా, కమామిషు అంతా అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లు వివరించారు.

ఉత్పత్తి ప్రపంచీకరణ

ప్రపంచంలో ప్రతీ దేశం తన ఆర్థిక, సహజ వనరులను దృష్టిలో వుంచుకొని, తమ అవసరాలను ఉత్పత్తి చేసుకొంటుంది. కొన్ని ఉత్పత్తులు తానే తయారు చేసుకోగలిగినా, వాటి అవసరం పరిమితంగా వుంటుంది కాబట్టి వాటిని దిగుమతి చేసుకొంటుంది. మరి కొన్నిటిని తన అవసరాలకు మించి ఉత్పత్తి చేసుకొంటే, వాటిని ఎగుమతి చేస్తుంది.

బ్రిటీష్ సామ్రాజ్య వాదులు మన దేశాన్ని పరిపాలించినపుడు మన సహజ వనరులను కారు చవుకగా కొని, బలవంతంగానే వారి ఓడల్లో వారి దేశానికి తీసుకొనిపోయి, వాటి ఆధారంగా ఉత్పత్తులను తయారు చేసి, మన దేశానికి దిగుమతి చేసేవారు. కాని రాజకీయ సామ్రాజ్యవాదం అంతరించి, దాని స్థానే ఆర్థిక సామ్రాజ్యవాదం చోటు చేసుకుంది. నగ్నంగా దోచుకొనిపోవడం స్థానే, ఆ పనినే తెలివిగా చేయడం ప్రారంభమైంది.

ఇలా వర్ధమాన దేశాలను కొన్ని వందల సంవత్సరాలు ప్రత్యక్షంగా, ఇపుడు పరోక్షంగా దోచుకోవడం వల్ల కొన్ని దేశాలు తెగబలిసిపోయాయి. దేశాల మధ్య అసమానతలు పెరిగాయి. దేశాల్లోనే పేద, ధనిక వర్గాల మధ్య అగాధం మరింత పెరిగింది. అభివృద్ధి చెందిన దేశాలు ఎంత ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయంటే, వారి వారి దేశాల అవసరాలు తీరగా, ఇంకా ఎంతో మిగిలిపోతోంది. అంతే కాదు. వారి అవసరాలు తీర్చేసుకొన్న తర్వాత ఆ ఉత్పత్తులకు తమ తమ దేశాల్లో డిమాండు తగ్గిపోతోంది.

సమాంతరంగా మరో పరిణామం కూడా ఆ దేశాల్లో చోటు చేసుకుంది. ఉత్పత్తిరంగంలో తలెత్తిన సమస్యలవల్ల, వారి లాభాలు తగ్గడం జరిగింది. ఈ స్థితిలో ఏ వర్ధమాన దేశాల్లో చవుకగా ఉత్పత్తి చేయవచ్చునో, ఏ దేశాల ఆర్థిక విధానాలను ప్రభావితం చేయవచ్చునో ఆ దేశాల మెడలు వంచి, తమ నిధులను ఆ దేశాల్లో పెట్టుబడి పెట్టడానికి అనుమతిని సంపాదించుకొన్నారు. ఇలా అనేక దేశాల్లో చేయాలంటే, తమ దేశాల్లో ఏ ఒక్క పెట్టుబడిదారుడు, పారిశ్రామికవేత్తా చేయలేడు. ఈ పరిణామంతో బహుళజాతి సంస్థ లకు పునాదులు పడ్డాయి. ఇన్ని దేశాల్లో పెట్టుబడులు పెట్టాలంటే, చాలా నిధుల కావాలి. అది బహుళ జాతి సంస్థలకే సాధ్యం. కాలక్రమంలో ఈ సంస్థలు ఎంత బలంగా తయారయ్యారంటే కొన్ని దేశాల జాతీయాదాయాలకన్నా ఒక్కొక్క కంపెనీ ఆదాయమే ఎక్కువ వుంటోంది. అభివృద్ధి చెందిన దేశాలదే టెక్నాలజీ రంగంలో పై చెయ్యి. అదీ కాక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విస్తరణతో రవాణా, కమ్యూనికేషన్ మరింత సులువైంది. ఇది కూడా ఉత్పత్తి ప్రపంచీ కరణకు తోడ్పడింది. ఈ పనులు చేసిపెట్టడానికి ప్రపంచ బ్యాంకు ఒక ఏజంటుగా పని చేస్తోంది.

మరో విధంగా కూడా వారి ఉత్పత్తులకు మార్కెట్లు సంపాదించే మార్గం అవలంభించారు. ఆ ప్రయత్నం ఫలితమే నేటి ప్రపంచ వ్యాపార సంస్థ (డబ్ల్యు.టి.ఓ.). ఈ సంస్థ నియమ నిబంధనల ప్రకారం దిగుమతులపై ఆంక్షలు విధించకూడదు. బహుళజాతి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తిచేస్తాయి కాబట్టి, స్కేల్ ఆఫ్ ప్రొడక్షన్ పెరిగినకొద్దీ ఉత్పత్తి ఖర్చు తగ్గుతుంది. చవకగా అమ్మినా లాభాలు ద్విగుణీకృతమౌతాయి. ఈ డబ్బుకాకుండా, వారివారి దేశాల్లో పెన్షన్ ఫండ్స్ పెట్టుబడులు పెట్టడానికోసం ఎక్కడ ఎక్కువ వడ్డీలు సంపాదించవచ్చునని ఆరాట పడుతున్నాయి. బహుళజాతి సంస్థల నిధులు ఉండనే వున్నాయి. ఈ డబ్బంతా పిల్లలు పెట్టాలి. ఎలా? ఈ ప్రశ్నకు జవాబే ఫైనాన్స్ కాపిటల్. ఈ నిధులతో చేసే వ్యాపారమే ద్రవ్య ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్ ఆఫ్ ఫైనాన్స్).

ఫైనాన్స్ కాపిటల్

డబ్బుతో వ్యాపారం అంటే సరుకులు తయారు చేసి అమ్మడం, కొనడం, ఎగుమతులు, దిగుమతులు కాదు, డబ్బు తీసుకొని వచ్చి, కర్మాగారాలు పెట్టడం అసలే కాదు. ఈ

వ్యాపారంలో ఎగుమతి చేసేది డబ్బు. వందలు వేలు, కోట్లు ఎంత కావాల్సి వస్తే అంత డబ్బు రకరకాలుగా వస్తుంది.

1. పరిశ్రమల్లో తమకు ఇదివరకే ఉమ్మడి రంగంలో 40 శాతం పెట్టుబడి వుంటే, దానిని నూరు శాతంవరకూ పెంచుకోవ డానికి భారత ప్రభుత్వం అనుమతించింది కాబట్టి, ఆ మేరకు డబ్బు వస్తుంది.

2. షేర్ మార్కెట్‌లో స్పెక్యులేషన్ కోసం డబ్బు వస్తుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకన్నా పోర్ట్‌ఫోలియో పెట్టు బడులు ఎక్కువగా పెరిగాయి. 1992 వరకూ విదేశీ పెట్టుబడులు పెట్టుబడి మార్కెట్‌లో అంటే స్టాక్ ఎక్స్ఛేంజీలో అనుమతించేవారు కాదు. అంతవరకూ విదేశీ ప్రయివేటు పెట్టుబడులూ, ప్రవాస భారతీయులు వగైరా పెట్టుబడులు వచ్చేవి. 93-94 వచ్చేసరికి విదేశీ ప్రయివేటు పెట్టుబడులు 62 కోట్ల డాలర్లుంటే, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు 349.3 కోట్ల డాలర్లున్నాయి. కాని, ఆ తర్వాత సంవత్సరంలో పోర్ట్ ఫోలియో పెట్టుబడులు 358.1 కోట్ల డాలర్లకు పెరిగాయి. అంటే, స్పెక్యులేషన్ కార్యక్రమాలకే విదేశీ ధనం ఎక్కువగా దేశంలో ప్రవేశించింది. మన ఉత్పత్తి పెరగడానికి, మన దేశాభివృద్ధికి తోడ్పడడానికి కాదు. దీనినే 'హాట్' మనీ అంటారు. ఈ హాట్ మనీ దేశంలో ప్రవహించడం ఎంత వేగవంతమైందంటే, 1994లో ఈ హాట్ మనీ మొత్తం విదేశీమారకం మొత్తంలో 37.5 శాతం వుండగా, ఫిబ్రవరి 98లో 78.80 శాతానికి పెరిగిపోయింది. అంటే ఇంత శాతం విదేశీ మారకం నిల్వలు ఏ నిమిషంలోనైన మన దేశంలో నుంచి బయటకు పోవచ్చు. ఇదే జరిగితే మళ్ళా 1991 దేశంలో పునరావృతమౌతుంది.

3. ప్రభుత్వాలకు అప్పు డబ్బు రూపంలో వస్తుంది.

4. అభివృద్ధి చెందిన దేశాల్లో వడ్డీరేటు నాలుగు శాతం మించి వుండదు కాబట్టి, ఎక్కడ ఎక్కువ వడ్డీ వస్తే అక్కడకు ఈ డబ్బు ప్రవహిస్తుంది. (గత సంవత్సరం రిసర్జెంట్ బాండ్స్, ఈ సంవత్సరం స్టేట్ బాంక్ మిలీనియం బాండ్స్‌లో పెట్టుబడికి హెచ్చు వడ్డీ హామీతో ప్రవాస భారతీయులు బాండ్లు కొన్నారు). డబ్బు ఈ విధంగా కూడా వచింది.

5. అభివృద్ధి చెందిన దేశాల్లో పెన్షన్స్ ఫండ్స్, మ్యూచువల్ ఫండ్స్ లాంటి వ్యవస్థాగత సంస్థలున్నాయి. ఉదాహరణకు పెన్షన్ నిధులు 1989లో 4 లక్షల 30 వేల కోట్ల డాలర్ల నుంచి 1994 నాటికే ఏడు లక్షల కోట్ల డాలర్లకు పెరిగాయి. అంతర్జాతీయంగా ఈ నిధులు పెట్టిన పెట్టుబడులూ 1994 నాటికి 79,000 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఇంత డబ్బు వడ్డీలకు తిప్పుతుంటే, వర్ధమాన దేశాల నుంచి పెట్టుబడి దారి దేశాలకు డబ్బు ఎలా, ఎంత మోతాదులో తరలి వెళుతుందో వూహించుకోవచ్చు.

ఇదివరకు వ్యాపార బాంకులు అప్పులిచ్చేవి. ఆ అప్పులు ఇప్పుడు తగ్గుముఖం పట్టడంతో వాటి స్థానాన్ని ఈ సంస్థలు భర్తీ చేస్తున్నాయి. ఇక్కడ ఒక పరిణామాన్ని గమనించాలి మొదట విదేశీ ప్రభుత్వాలే నేరుగా రుణాలిచ్చేవి. ఆ తర్వాత విదేశీ రుణాలు తగ్గి వ్యాపార బంకుల రుణాలు పెరిగాయి. ఇప్పుడు ఆ రుణాలు కూడా తగ్గి, పైన ఉదహరించిన సంస్థల రుణాలు పెరుగు తున్నాయి. 1991-96 మధ్య ఒక్క అమెరికా ఇన్వెస్టర్లే 33,000 కోట్ల డాలర్లు ప్రపంచ దేశాల స్టాక్ మార్కెట్లలో, బాండ్స్‌లో పెట్టుబడులు పెట్టాయి.

6. డబ్బు 24 గంటలూ, 365 రోజులూ ప్రపంచాన్ని చుట్టివస్తూ వుంటుంది. సాంకేతిక, ఐ.టి. రంగాల విస్తరణ పుణ్యమా అంటూ ఎంత డబ్బయినా సరే నిముషంలో మరో దేశానికి పంపవచ్చు. తెచ్చుకోవచ్చు. వివిధ దేశాల్లో కాలమానం వివిధ రకాలుగా ఉండడంవల్ల (మనకు తెల్లవారితే, మరో దేశంలో ఇంకా రాత్రే) ఒక దేశంలో స్టాక్ ఎక్స్ఛేంజి మూసే సమయానికి, మరో దేశంలో ప్రారంభం అవుతుంది. ఇలా ప్రపంచంలో 24 గంటలూ ఏదో దేశంలో స్టాక్ ఎక్స్ఛేంజీలు పనిచేస్తూనే వుంటాయి. అందుచేత డబ్బు ఎల్లప్పుడూ దేశ విదేశాలు తిరుగుతూనే వుంటుంది. వానికి పర్యాటక రంగంతో పనిలేదు.

డబ్బు పరిభ్రమణం ఎంత వేగంగా వుందంటే అన్ని వర్ధమాన దేశాలకూ నికరంగా ప్రవహించిన ప్రైవేటు పెట్టుబడులు 1990లో 4,440 కోట్ల డాలర్ల నుంచి 1996 నాటికి ప్రాథమిక అంచనా ప్రకారం 24,380 కోట్ల డాలర్లకు పెరిగింది. ఇందులో ఒక్క చైనాకే 5,200 కోట్ల డాలర్లు వెళ్ళింది. ఇంత డబ్బు చలామణిలో వుంటే పెట్టిన పెట్టుబడులకన్నా లాభాలు ఎక్కువగా ఆ దేశాల నుంచి తరలిపోతుంటాయి. ఉదాహరణకు సబ్‌సహారన్ ఆఫ్రికా దేశాలనుంచి 1984లో ప్రారంభమై ప్రతి సంవత్సరం నికరంగా ఆ దేశాల్లోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష ప్రైవేటు పెట్టుబడుల కన్నా ఎక్కువగా లాభాలు ఆ దేశాలనుంచి తరలివెళ్లాయి. ఈ దేశాల్లో సంపాదించిన లాభాలు 1990-1994 మధ్య 24 నుంచి 30 శాతం.

పైన ఉదహరించిన గణాంక వివరాలన్నీ కేవలం ప్రైవేటు రంగంనుంచి వర్ధమాన దేశాలకు ప్రవహించిన పెట్టుబడులు గురించి మాత్రమే. ప్రభుత్వాల మధ్య జరిగే లావాదేవీలలో చేతుల మారే డబ్బు ఈ లెక్కలో లేవు. ఆకుమీద ముల్లొచ్చి పడ్డా, ముల్లు వెళ్ళి ఆకుమీద పడ్డా ఆకుకే నష్టం అన్నట్లు అభివృద్ధి చెందిన దేశాలు మాంద్యాన్ని ఎదుర్కొంటున్నా లేదా మూడు పువ్వులూ, ఆరు కాయులుగా వర్ధిల్లుతున్నా వర్ధమాన దేశాలకే ముప్పొచ్చి పడుతుంది. ఆ దేశాల్లో ఆర్థిక పరిస్థితి పైలా పచ్చీస్‌గా వున్నప్పుడు, వర్ధమాన దేశాల్లో మరిన్న పెట్టుబడులు పెడతాయి. ఆ దేశాల్లో పరిస్థితి బాగోలేనపుడు కూడా బాండ్లు విడుదల చేయడం, మ్యూచువల్ ఫండ్స్ లాంటి అనేక పద్ధతుల ద్వారా వారి పరిమిత పెట్టుబడులను పెట్టుబడి పెట్టి, వడ్డీల ద్వారా వర్ధమాన దేశాల

ప్రపంచీకరణ - భారత సార్వభౌమాధికారంపై దాడి

- భూ. సాంబశివరాజు

ప్రపంచీకరణ - భారత సార్వభౌమాధికారంపై దాడి అనే పుస్తకాన్ని ఢిల్లీనుండి న్యూవిస్టాస్ పబ్లికేషన్స్‌వారు అక్టోబర్, 2002లో మొదటసారి ప్రచురించారు. ఈ పుస్తక రచయిత పేరు అరవింద్.

ప్రపంచీకరణపై ఎన్నో వ్యాసాలు, పుస్తకాలు వచ్చాయి. ఈ పుస్తకం యొక్క ప్రత్యేకత ఏమంటే, భారతదేశంలో ప్రపంచీకరణ శక్తుల అన్నిరకాలవిన్యాసాలను సోదాహరణంగాను, విపులంగానూ, విస్తృతంగానూ, జాతీయతా దృక్పథంలో చర్చించడం జరిగింది. ప్రజాపక్షం వహించి జరిపినది. ఈ చర్చ పూర్తిగా శ్రామిక వర్గ రాజకీయ దృక్పథంతో రాసినటువంటి పుస్తకం. దేశంలో దళారీ పెట్టుబడిదారీ, పెత్తందారీ వర్గాలు, మతతత్వ శక్తులు ఏరకంగా సామ్రాజ్యవాద శక్తులతో లాలూచీపడి భారతదేశాన్ని ఎలా సామ్రాజ్య వాదుల పాదాక్రాంతం చేస్తున్నదీ, భారత ప్రజల మూల్గులను పీల్చి పిప్పి చేసి అంతర్జాతీయ దొరల పాదాలవద్ద మోకరిల్ల చేస్తున్నది సవివరంగానూ, జాతీయతా దృక్పథంతోనూ ఈ పుస్తకం తెలియ జేసింది. ఎక్కడికక్కడ పట్టికలు, గణాంక వివరాలు ఇవ్వడం జరిగింది.

విమర్శనాత్మక కార్టూన్స్ కూడా ఈ పుస్తకం ప్రత్యేకత. ముందుమాట, అనుబంధాలుకాక 16 అధ్యాయాలుగా 250 పేజీలలో ఈ రచన కొనసాగింది. ఈ పుస్తకానికి రాసిన ముందు మాటలో ప్రపంచీకరణ ఎందుకు ఎవరికోసము అనే విషయాన్ని, దేశీయ దళారి పెట్టుబడిదారీ మరియు పాలకవర్గాల అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి, సామ్రాజ్యవాద శక్తులకు ఎలా దాసోహమై హమయ ఉడిగం చేస్తున్నాయో వివరించారు. పుస్తకంలోని మొదట అధ్యాయంలో భారతదేశంలో విదేశీ పెట్టుబడి ఏ రకంగా చొచ్చుకుని పోయిందో వివరించారు. ప్రపంచీకరణకు ముందు, భారతపాలకవర్గాల దగాకోరు విధానలగురించి రెండవ అధ్యాయం లో చెప్పారు. కాంగ్రెస్ ఐ పరిపాలనలోను తర్వాత యునైటెడ్ ఫ్రంట్ పరిపాలనలోనూ, ప్రస్తుతం కాషాయ ప్రభుత్వం సర్వం అమ్మివేసే బాటలో జరుగుతున్న వ్యవహారం వివరించారు. గ్లోబలైజేషన్ అంటే పెద్దమొత్తంలో విదేశీ పెట్టుబడులనే మూడవ అధ్యాయంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి, పోర్ట్‌ఫోలియో పెట్టు బడులు, విదేశీ ఋణ ఉచ్చు అనే విషయాలు చాలా వివరంగా తెలియజెప్పారు.

ద్రవ్యపెట్టుబడిదాడి అనే నాలగవ అధ్యాయంలో ఏవిధంగా భారతదేశ పరిశ్రమను ట్రాన్స్‌నేషనల్ కంపెనీస్ (టిఎన్‌సి)కి ఆక్రమించుకున్నాయో, భారత దళారీ పెట్టుబడిదారులు విదేశీ పెట్టుబడి చొరబాటుకు ఏరకంగా వాహకాలుగా ఉంటున్నారో తెలియజెప్పారు. ఇంకా ఇన్ఫోటెక్, రిలయన్స్, టాటాలు, బిర్లాలు తదీతర దళారీ వ్యాపారవర్గాల గురించి, ఎన్నారైల గురించి చాలా వివరణలు ఇచ్చారు.

నుంచి డబ్బు సంపాదించడం జరుగుతుంది. వాళ్ళ కత్తికి రెండు వైపులా పదునుంది.

రూపాయి విలువ పతనం

పైన పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు, పెన్షన్ ఫండ్స్, మ్యూచ్ వల్ ఫండ్స్ దేశంలోకి ఎలా ప్రవాహంలా వచ్చిపడుతున్నాయో వివరాలివ్వడం జరిగింది. అవి అంతే అకస్మాత్తుగా ఎలా ఉపసంహ రించబడతాయో కూడా తెలుసుకున్నాం. అవి దేశంలోకి వచ్చి నపుడు ఎంత రూపాయి మారకం విలువ వుందో, ఆ విలువ మేరకే ఉపసంహరించినపుడు తీసుకొనిపోతారు. ఇటీవలి కాలంలో డాలర్‌తో పోలిస్తే మన రూపాయి విలువ ఎలా పతనమైందో, 1996లో 36 రూపాయల మారకం విలువ ఇప్పుడు 46 రూపాయ లకు పడిపోయిందో మనకు తెలుసు. పోర్ట్‌ఫోలియో పెట్టుబడి 1996లో ఒక డాలరు వస్తే, అంటే 36 రూపాయలు వస్తే, ఈ రోజున తీసుకొనిపోయే ప్రతి డాలర్‌కు 46 రూపాయల లెక్కన తీసుకొనిపోతాడు. (ఉదాహరణకు మనం తెచ్చుకొనే అప్పుల విషయం తీసుకొంటే, 1997 లో డాలర్‌కు రూ. 36లు మారకం ఆ తర్వాత 39కి పడిపోయినపుడే మన రుణాలు ఉత్తి పుణ్యానికి 40వేల కోట్ల రూపాయలకి పెరిగిపోయాయి) రిజర్వుబ్యాంకు విదేశీ మారకం నిల్వలు 26,600 కోట్ల డాలర్లు నష్టపోయాయి. ప్రైవేటు విద్యుత్ ప్రాజెక్టులు, టారిఫ్‌లు, పెట్టుబడులు, విదేశీ యంత్రాలు అన్నీ డాలర్లలోనే విలువలు లెక్కిస్తారు. కాబట్ట ఆటోమేటిక్‌గా ఖరీదులు పెరుగుతాయి. అది వినిమయదారుల మీదపడుతుంది. విదేశీ పెట్టుబడిదారుల పంట పండుతుంది. విదేశీయు లకు లాభాలు సంపాదించిపెట్టడానికి, వినిమయ దారులకు భారాలు పెంచడానికి ప్రభుత్వం మంత్రసానిపని చేస్తున్నదన్న మాట.

(ప్రజాశక్తి, నవంబర్ 22, 2000) ❑

వాణిజ్య జాడ్యము, గ్రామీణ వ్యవస్థ దుర్గతి, భారతదేశ ఆస్తుల తెగ అమ్మవేత, ప్రపంచీకరణ రాష్ట్ర ప్రభుత్వాల పెనవేత, విదేశీ దోపిడీ, పారిశ్రామిక స్థబ్ధత, ఆర్థిక వెనుకబాటు, రాజకీయ బానిసత్వము, రాజ్యవ్యవస్థ - సామ్రాజ్యవాద మిలాఖత్, వివిధ ప్రజా రాసులపై సెక్షన్లపై ప్రపంచీకరణ ప్రభావం, విభిన్న సామాజిక వర్గాలపై దాని ప్రభావము, సామిజిక సాంస్కృతిక రంగాలపై ప్రపంచీకరణ ప్రభావము, స్వతంత్ర విముక్తి భారతావనికై ప్రజలు అనే అధ్యాయాల ద్వారా ఓ సంపూర్ణ భారతదర్శనం ఈ రోజువరకు సాగిన, సాగుతున్న చరిత్రను విజ్ఞానదాయకంగా, సవివరంగా, సోదాహరణంగా చక్కగా వివరించారు.

ప్రముఖ లాటిన్ అమెరికన్ వ్యాఖ్యాత జేమ్‌పెట్రాస్ రాసిన "సామ్రాజ్య వాదపు సేవలో నాన్ గవర్నమెంటు ఆర్గనైజేషన్స్ అనే వ్యాసము, లాటిన్ అమెరికాలో ఎన్జీవోస్ మరియు సామ్రాజ్య వాదము అనే వ్యాసాలు అనుబంధంలో చేర్చారు. "ప్రపంచ బ్యాంక్ మరియు భారతదేశం" ప్రపంచబ్యాంక్ - భారతదేశ సంబంధాలు (1944-1994) పబ్లిక్ ఇంటరెస్ట్ రీసెర్చ్ గ్రూప్ వారి వ్యాసాలను కూడా అనుబంధంలో చేర్చారు.

ఈ పుస్తకం కేవలం అకాడమిక్ ఆంగిల్‌నుండి రాసినది కాదు. సామాజిక, రాజకీయ, ఆర్థిక కోణాల నుండి ప్రజలకు భారతదేశ పూర్తి పరిస్థితిని విశదపరచి, వారి దీనా వస్థ వెనుక ఉన్న శక్తులు, వాటి పునాదులు, వాటి విస్తరణ, అవి ఏ రకంగా అంతర్జాతీయ సామ్రాజ్యవాద పెట్టుబడికి సేవ చేస్తున్నదీ, అందుమూలంగా ప్రజలు ఏరకంగా నష్టపోతున్నదీ కూలంకషంగా చర్చించడమే కాకుండా ఈ పరిస్థితినుండి దేశాన్ని కాపాడాలంటూ ప్రజల ముందున్న ప్రత్యామ్నాయ విముక్తి మార్గాన్ని అవసరమయిన ఆచరణను విశదీకరించింది.

భారతదేశంలో ఏఏ శక్తులు ప్రపంచీకరణ కొమ్ము కాస్తున్నాయో, వాటి స్వప్రయోజనాలు ఏరకంగా నెరవేర్చుకుంటూ విస్తృత ప్రజారాసులను దుర్భర దారిద్ర్యంలోనికి, బానిసత్వంలోనికి, చీకటి యుగంలోనికి తిరిగి నెట్టివేస్తున్నాయో తెలియజెప్పిన ఉత్తమ గ్రంథం ఇది.

ఇంగ్లీషులో ఉన్న ఈ పుస్తకాన్ని వెనువెంటనే తెలుగుతో సహా అన్ని భారతీయ భాషల్లో తీసుకువచ్చి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్ళవలసిన పుస్తకం. ఈ దేశాన్ని పెనుముప్పునుండి కాపాడి, స్వయం ప్రతివృత్తితో, స్వావలంబనతో నడిపించుకుని దేశ ప్రజల స్వతంత్ర జీవనాన్ని కాపాడి, పెంపొందించడానికి నిజమయిన జాతీయతా వాదులంతా ఈ పుస్తకాన్ని ప్రజలలోనికి తీసుకు వెళ్లడానికి కృషి చేయవలసిన అవసరం ఎంతైనా వుంది.

ప్రపంచీకరణ అనే ఈ వ్యవహారమంతా ఎవరు ఎవరికోసం ఎందుకు నడిపిస్తున్నారో అనే జ్ఞానం ప్రజలందరికీ చాలా అవసరం.

పాలకవర్గాలు, దళారీ ప్రభుత్వాలు ఇంటా-బయటా ఒక బలీయమయిన దోపిడీ-దళారి-మతవాద సంఘటనగా ఏర్పడి ప్రపంచీకరణ మంత్రాన్ని నిత్యం జపిస్తూ, మాయాపూరిత భ్రమలు కాల్పనిక ప్రచారం తళుకుబెళుకుల ఆకర్షిత పథకాలు, పోలీసు మిలటరీ అణచివేత, ఫాసిస్టు, నిర్బంధం, బానిసత్వ ఆలోచనా విధానం, విపరీత వస్తు వినిమయ సంస్కృతి, ఇలా రకరకాల పద్ధతులలో ప్రజలను ముంచెత్తుతూ ప్రశ్నించిన చోట పాశవికంగా అణచివేస్తూ వారిని విముక్తి మార్గానికి దూరంగా ఉంచడానికి సర్వదా ప్రయత్నిస్తున్నారు. ప్రజలు ఎంతోమంది చదువుకున్న యువతీ, యువకులు కూడా పాలకవర్గం సృష్టించి ప్రచారం చేస్తున్న మోసపూరిత మాయలోకంలో విహరిస్తున్నారు.

అన్ని సెక్షన్ల ప్రజలముందు మెల్లమెల్లగా ఇటువంటి ఊహాలోకపు కలలు కల్లలై నిజాలు నగ్నంగా సాక్షాత్క రిస్తున్నాయి. పూర్తిగా ఈ భ్రమలనుండి బయటపడాలంటే పైన ఉదహరించిన పుస్తకం, ఇంకా అటువంటి ఆచరణాత్మక జ్ఞానాన్ని, మార్గాన్ని తెలియజేప్పే ప్రజా దృక్పథం కలిగిన సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణా రచనలు ముందుముందు చాలా అవసరం.

ఈ పుస్తకం ప్రజాశక్తి, నవోదయ, దిశ, ఇతర పుస్తక కేంద్రాలలో లభ్యమౌతుంది. ❐

(4వ పేజీ తరువాయి)

నష్టాలలో ఉన్న సింగరేణి ఉత్పత్తిని పెంచి లాభాలదిశగా మరల్చి బి.ఐ.ఎఫ్.ఆర్. బారిన పడకుండా కాపాడుకున్న కార్మికులకు చంద్రబాబు ఇచ్చిన బుహుమానం సింగరేణిలో క్రమక్రమంగా కార్మికుల సంఖ్యను 1.18లక్షల నుండి 18వేలకు తగ్గించటం, అనేక ఇతర సౌకర్యాలు తగ్గించటం లేదా రద్దు చేయటం. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలకు, ముఖ్యంగా గుర్తింపు పొందిన సంఘంలో కూడా తెలియకుండా, కాంట్రాక్టరూ (ప్రయివేటీకరణ ఇలానే ప్రారంభమవుతుంది) చేపట్టడం, కార్మికులల్లో అనుమానాలకు దారితీయటం, కాంట్రాక్టర్ గారి నుంచి వెను తిరిగేది లేదనటం సమ్మెకు దారి తీసింది. సహకరించిన కార్మికులతో పట్టువిడుపులు ప్రదర్శించి పరిష్కారానికి ప్రయత్నించకుండా, అన్ని ప్రయివేటు యాజమాన్యుల్లాగా, ప్రభుత్వం కూడా కార్మికనాయకుల మీద నీచప్రచారం, విచ్ఛిన్నానికి ప్రయత్నం, పోలీసు దమస కొండ లాంటి ఆయుధాలను ప్రయోగించిందంటే, దాని వెనుక ప్రపంచ బ్యాంకు హస్తం వుంది. కార్మిక సంఘాలు లేని పరిశ్రమలుండాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా వుంది. ఈ సమ్మె ఇతరకార్మికులకు ఎన్నో గుణపాఠాలు నేర్పింది.

మా ఐక్య కార్యాచరణతో, సమిష్టి కృషితో కోర్కెలను సాధించే హక్కు మాకూ వుందని కార్మికుల జవాబు. ❐

జనవరి 16-31, 2003

రాష్ట్రం

16. మరో 111 మండలాలు కరువు మండలాలు మొత్తం 1036.
1786 పట్టు పరిశ్రమ ఉద్యోగులకు ఉద్వాస
కరువు నష్టం 5226 కోట్లు - మంత్రివర్గం
17. సైబర్ గ్రామీణ్ ప్రారంభం.
18. సింగరేణిని ప్రయివేటీకరించం - ముఖ్యమంత్రి
బస్సు ఛార్జీలు పెంచం - రవాణా శాఖ మంత్రి
22. సింగరేణి సమ్మె ప్రారంభం
ముసాయిదా బడ్జెట్ విడుదల
23. అసిస్టెంట్ మోటర్ వాహనాల ఇన్‌స్పెక్టర్ ఆస్తులు 60 లక్షలు.
ప్రముఖ ఆర్థికశాస్త్ర వేత్త ప్రొఫెసర్ బ్రహ్మానంద మరణం
24. వాహనాలపై జీవిత పన్ను పెంపు.
వివిధ శాఖల ముసాయిదా బడ్జెట్ల విడుదల
జాతీయ రహదారులపై ఆటో నిషేధం
కరెంటు ఛార్జీలు పెరగనివ్వం - విద్యుత్ మంత్రి
25. ఇంజనీరింగ్ విద్య ఫీజు పెంపు
27. సింగరేణి కోల్ బెల్ట్ : బంద్ సంపూర్ణం
29. రాష్ట్రానికి సర్దుబాటు రుణానికి తిరస్కృతి
1000 కోట్ల మార్కెట్ రుణానికి అనుమతి
ఇద్దరు పోలీసు అధికారులను నక్సలైట్లు కిడ్నాప్
లాకప్‌లో మరణిస్తే సి.ఐ. అరెస్టు, డి.ఎస్.పి. సస్పెన్షన్, ఎస్పై బదిలీ.
జాతీయ రహదారులపై ఆటోల నిషేధం
30. ఆర్టీసి ఛార్జీలపెంపు - రు. 152 కోట్లు అదనపు భారం.
ఆర్యవైశ్య బంద్ - మిశ్రమ స్పందన.

దేశం

17. చలి గుప్పెట్లో దేశం : ఒకేరోజు 70 మంది మృతి.
ఏప్రిల్ నుంచి వాట్ : రాష్ట్రాల అంగీకారం
చుక్కలంటిన బంగారం ధర : 10 గ్రాములు రు. 5,760
ఉమ్మడిగా రష్యా, భారత్ జెట్ ఫైటర్ల అభివృద్ధి.
రాష్ట్ర మూడో ఆర్థిక సంఘం నియామకం
18. 'ఆకాశ' విజయవంతంగా ప్రయోగం
విశాఖలో నజ్‌మెరైన్ల రిపేర్ల కేంద్రం - రష్యా - భారత్ అంగీకారం
షిండే మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం
కేరళకు రు. 10 వేల కోట్లు. ప్రధాని వాజ్‌పాయ్.
19. నక్సల్స్ బాధిత రాష్ట్రాలకు సహాయం చేస్తాం - అద్వానీ
సుప్రీం జడ్జిపైనే ఆరోపణలు - పరిశీలనకు సుప్రీం ఆదేశం
24. భారత క్రికెటర్లపై ఆంక్షల సడలింపు
25. టెలిఫోన్ ఛార్జీల పెంపు
26. హెచ్.పి.సి.ఎల్, బి.బి.సి.ఎల్ ప్రైవేటీకరణకు కేంద్రమంత్రి వర్గ ఉపసంఘం ఒ.కె.
27. క్రికెటర్ అజయ్ జడేజాపై నిషేధం తొలగింపు
ఎ.హెచ్.ఆర్.సి. కొత్త ఛైర్మన్‌గా జస్టిస్ ఎ.ఎస్.ఆనంద్.
29. కేంద్ర కాబినెట్‌లో మార్పులు 8 మందికి కొత్తగా చోటు
మహారాష్ట్ర మంత్రుల జీతాల్లో సగం కోత
31. రాజస్థాన్‌లో బయల్పడిన గ్యాస్, ఆయిల్ నిక్షేపాలు.
హిమాచల్, త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌ల్లో ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ
మళ్ళీ పెట్రోల్, డీజిల్ ధరల పెంపు 40 పైసలు.

వినదగు నెవ్వరు చెప్పిన

2002-03 బడ్జెట్ సమావేశాల్లో అత్యంత ప్రధాన పద్దులతో సహా రికార్డు స్థాయిలో 51 పద్దులు (మొత్తం పద్దులు 56) ఎటువంటి చర్చ లేకుండానే శాసనసభ ఆమోదం పొందాయి. 51 పద్దులు గిలెటిన్ అయినట్లు స్పీకర్ ప్రతిభా భారతి ప్రకటించారు. ఆర్థిక, రెవెన్యూ, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, వైద్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, హోంశాఖలలాంటి పద్దులన్నిటిమీద చర్చే జరగలేదు.

- ఆంధ్రభూమి 29 మార్చి 2002

వర్షాభావ పరిస్థితుల పుణ్యమా అంతో ఇంతో పంట తక్కువ కావటం వల్ల సబ్సిడీలు తగ్గుతాయి. కనుక ప్రభుత్వానికి రు. 7489 కోట్లు ఆదా అవుతుంది.

- ఎకనమిక్ టైమ్స్ 1 ఫిబ్రవరి 03

గత రెండేళ్ళలో ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగుల సంఖ్య రెండుకోట్లు పెరిగింది. కోట్లాది మంది గత్యంతరం లేక అరకొర వేతనాలకు పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 18 కోట్ల నిరుద్యోగులున్నారు.

- ఇంటర్‌నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్